తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
06-09-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 209
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# విద్యుత్ ఉద్యోగుల నోటికి తాళం!

## మా అనుమతి లేకుండా మాట్లాడొద్దంటూ హుకుం

- తెలంగాణ ట్రాన్స్‌కో డైరెక్టర్ వివాదాస్పద ఉత్తర్వులు
- కార్యాలయాల్లో, క్యాంటీన్లలో, బయట వ్యక్తులతో మాట్లాడినా క్రమశిక్షణ చర్యలంటూ హెచ్చరికలు
- ఫోటోగ్రాఫర్లు, విలేకర్లతో మాట్లాడితే వేటేనట
- ప్రజాస్వామ్యమా, నియంతృత్వమా అని ఉద్యోగ సంఘాల మండిపాటు
- అవినీతి, అక్రమాలు బయటకు రాకుండా తొక్కిపెట్టేందుకే ఆంక్షలు
- ఇప్పటికే కొత్త డిస్కమ్ ఏర్పాటుపై గందరగోళం
- జెన్కో లో ప్రయివేటు నిర్వహణ టెండర్లపై కార్మికుల గుర్రు



తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్

తెలంగాణ విద్యుత్ రంగంలో యాజమాన్యాల తీరు రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. సంస్థలో జరుగుతున్న పరిణామాలు, అక్రమాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు ఉద్యోగుల భావప్రకటనా స్వేచ్ఛపై ఏకంగా ఉక్కుపాదం మోపుతున్నారు. గత నెల 21వ తేదీన తెలంగాణ ట్రాన్స్‌కో డైరెక్టర్ (హెచ్‌ఆర్) ఓరుగంటి శ్రీనివాసులు జారీ చేసిన అంతర్గత ఆదేశాలు విద్యుత్ వర్గాల్లో పెను దుమారం రేపాయి. సంస్థ ఉద్యోగులు ఎవరూ కూడా ముందస్తు అనుమతి లేకుండా బయటి వ్యక్తులు, పత్రికా విలేకర్లు, కనీసం ఫోటోగ్రాఫర్లతో కూడా మాట్లాడకూడదని, మాట్లాడితే తీవ్ర క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంపై ఉద్యోగ సంఘాలు భగ్గుమంటున్నాయి. కార్యాలయాలు, క్యాంటీన్లు మాత్రమే కాకుండా కార్యాలయం వెలుపల సైతం మాట్లాడొద్దని హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో నియంతృత్వ పోకడలకు పరాకాష్ట అని కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి.

మిగతా 2వ పేజీలో..

# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

## వెయ్యి రోజులు మోసం చేసిన రేవంత్ తప్పుకోవాలి

- నిరుద్యోగులను నిండా ముంచారు
- 2006లో కేసీఆర్ రాజీనామా చేస్తే కాంగ్రెస్ వీపు పగిలింది
- చేసిన మోసాలకు కాంగ్రెస్ నాయకులు 420 సార్లు రాజీనామా చేయాలి
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మెక్కడం తప్ప కాంగ్రెస్ నేతలు చేసిందేమీ లేదు
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్, సెప్టెంబర్ 5 :

'తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలని తీట మాటలు మాట్లాడుతున్నరు.. నేను అడుగుతున్నా.. ఎవరు రాజీనామా చేయాలని.. రాజీనామా ఎందుకు చేయాలి? తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా? రేవంత్ రెడ్డి అనే బట్టేబాజ్ గాడు రాజీనామా చేయాలా అని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 100 రోజులు అని చెప్పి వెయ్యి రోజులు మోసం చేసిన దొంగబాజ్ గాడు రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ వెయ్యి

మిగతా 3వ పేజీలో..




## భవిష్యత్తు డేటా, ఏఐ రంగాలదే

- కాన్‌స్టర్ నూతన కార్యాలయం ప్రారంభించిన కేటీఆర్
- టైర్-2, 3 నగరాల యువతలో అపారమైన ప్రతిభ, పట్టుదల

3

## ఎలక్ట్రానిక్ జాకార్డ్‌తో కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గం ఆవిష్కరణ

- సిరిసిల్ల నేతన్నకు కేటీఆర్ ప్రశంసలు.. 'వెండి వెన్నెల' చీర ఆవిష్కరణ
- అధికారంలోకి వస్తే కర్మాగారం నెలకొల్పుతాం: కేటీఆర్ హామీ

3



## మోదీ 'జెన్‌జీ' మాటలతో సందడి

- ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకల ముగింపు సభలో ప్రధాని ప్రసంగం
- 'OG', 'ఫ్లెక్స్,' అంటూ విద్యార్థుల్లో ఉత్సాహం
- 2013 నాటి 'సగం నిండిన గ్లాస్' ప్రసంగం గుర్తుచేసుకున్న మోదీ
- ప్రపంచ స్థాయి సంస్థలుగా భారత కంపెనీలు ఎదగాలని పిలుపు

7

## యూస్‌మార్గ్‌లో లష్కరే కమాండర్ హతం

- భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- ఎదురుకాల్పుల్లో యాసిర్ మృతి
- 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ గాలింపు
- స్థానిక నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం
- సులైమాన్ మూసా గ్రూప్‌తో గతంలో సంబంధాలు

7

# వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ప్రణాళిక

- రూ.18,250 కోట్లతో 65 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు
- అక్టోబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 5:

రాబోయే వానాకాలం సీజన్‌లో రూ.18,250 కోట్ల అంచనా విలువతో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ కార్యాచరణను అమలు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యం

మిగతా 3వ పేజీలో..





## అసెంబ్లీ సమావేశాలకు సహకరించాలి

- సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు సత్వరం అందించాలి
- చర్చ సమయంలో అధికారులు అందుబాటులో వుండాలి
- మెటీరియల్‌ను ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురించాలి
- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

2

## 22ఏలో చేర్చడం మానవ హక్కుల ఉల్లంఘనే

3

# రోడ్లపై వంటావార్పుతో తెలంగాణ వచ్చింది

- రేవంత్‌రెడ్డి హయాంలో మళ్లీ అదే ఖర్మ పట్టింది
- రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి
- కేసీఆర్ పాలనలో 24 గంటలు కరెంట్ వుండేది
- ఇప్పుడు పొద్దున లేస్తే కరెంటు కోసం ఫోన్లు
- యూరియా దొరక్క రైతుల పాట్లు
- అన్నీ పక్కాగా రావాలంటే కేసీఆర్ సీఎం కావాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు




దుబ్బాక, సెప్టెంబర్ 5:

మా తెలంగాణ మాకు కావాలని రోడ్ల మీద వంటా వార్పు చేస్తే తెలంగాణ వచ్చింది. పదేళ్లు కేసీఆర్ నాయకత్వంలో అంతా చల్లగా ఉన్నాం. కానీ, ఈ రేవంత్ రెడ్డి పుణ్యమా అని రైతులు మళ్లీ వంటా వార్పుతో రోడ్ల మీదకు ఎక్కాల్సిన ఖర్మ పట్టిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. రైతు సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై

మిగతా 3వ పేజీలో..



## కులగణనపై కేంద్రం యూటర్న్

- ఓబీసీ కులగణనపై కాంగ్రెస్ దేశవ్యాప్త ఉద్యమం
- తెలంగాణ తరహా కులగణనను దేశమంతా చేపట్టాలి
- సామాజిక న్యాయం, న్యాయమైన వాటా కోసం పోరాటం
- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించాలి

2



## హనీట్రాప్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

- డేటింగ్ యాప్ పరిచయంతో రూ.14.75 లక్షలు మోసం

2



# హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

హైదరాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ప్రకటించింది. అందుకు సంబంధించి ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. టీసీఎస్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సచివాలయంలో శనివారం సమావేశమైంది. హైదరాబాద్‌లో 250 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఒక గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్‌వాల్ట్‌తోపాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు ఏడు వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకే కాక దేశానికి ఇది చరిత్రాత్మక ప్రాజెక్టు అని అన్నారు. ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. టీసీఎస్ ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని అభిప్రాయపడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని చెప్పారు. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్‌న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం ప్రభుత్వం టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చింది. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీసీఎస్ సీఈఓవో కె.కృతివాసన్, సీవోవో ఆర్తి సుబ్రమణియన్, హైపర్‌వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్‌వాల్ట్ సీఈవో, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి ఒపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె.శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# కులగణనపై కేంద్రం యూటర్న్

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

ఓబీసీ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం యూటర్న్ తీసుకున్నదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు కొప్పుల రాజు ఆరోపించారు. కేంద్రం వెంటనే ఓబీసీ కులగణన చేపట్టాలని, ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేపడుతుందని స్పష్టం చేశారు. సరైన గణన, కచ్చితమైన గణాంకాలు, న్యాయమైన వాటా, సామాజిక న్యాయం కోసం తమ పార్టీ పోరాడుతుందని తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కేంద్రం హామీపై విమర్శలు**

గత ఐదేళ్లుగా కాంగ్రెస్, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని కొప్పుల రాజు తెలిపారు. ఈ అంశాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించిందన్నారు. జనాభా లెక్కలతో పాటు ఓబీసీ కులగణన చేపడతామని బిహార్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ చెప్పారని, అయితే ప్రస్తుతం జనాభా లెక్కల్లో ఓబీసీ కులగణనకు కేంద్రం అవకాశం కల్పించడం లేదని ఆరోపించారు. ఫ్యామిలీ సర్వేతో పాటు ఓబీసీ కులగణన చేస్తామని పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారని, కానీ అందుకు సంబంధించిన ఫారంలో ఓబీసీ ప్రస్తావన లేదని అన్నారు.

**తెలంగాణ మోడల్‌పై ప్రస్తావన**

తెలంగాణలో కులగణన సందర్భంగా ఓబీసీ కుల సంఘాలతో చర్చించి 134 ఓబీసీ కులాలను గుర్తించామని కొప్పుల రాజు తెలిపారు. రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన నిర్వహించామని పేర్కొన్నారు. ఓబీసీల్లో ఎన్ని కులాలు ఉన్నాయనే లెక్క తేల్చడం సాధ్యం కాదన్న వాదన సరికాదన్నారు. పదేళ్లుగా ఓబీసీ సామాజిక న్యాయ అజెండా నెరవేరడం లేదని విమర్శించారు. ఓబీసీ డేటా ఖరారైతే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలని సీడబ్ల్యూసీలో నిర్ణయించామని చెప్పారు.

**మహిళా రిజర్వేషన్లలోనూ వాటా**

మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కకుండా పోయే అవకాశం ఉందని కొప్పుల రాజు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినప్పుడు ఓబీసీ డేటా లేకుండా చేశారని ఆరోపించారు. ఓబీసీ హక్కుల కోసం ఏఐసీసీ 100 రోజుల కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఏఐసీసీ ప్రచారం చేస్తోందన్నారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న వర్గాల వద్ద కేవలం 3 శాతం సంపద ఉందని పేర్కొంటూ.. పెద్ద కాంట్రాక్టులు ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయో గమనించాలని సూచించారు.

**తెలంగాణ దేశానికి రోల్ మోడల్**

తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రీయంగా కుల సర్వే నిర్వహించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ కులగణన దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. బీసీ హక్కుల కోసం దేశవ్యాప్తంగా 100 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ దేశ భౌగోళిక, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకున్నారని, 'ఎవరి జనాభా అంత వారికి భాగస్వామ్యం' అనే నినాదంతో ముందుకు సాగారని తెలిపారు. ఆ నినాదం ఇప్పుడు ఉద్యమంగా మారిందన్నారు.

**సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబాటు**

కులగణన సర్వే వివరాలను బహిరంగంగా అందుబాటులో ఉంచామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో ఉండాలా వద్దా అనే విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవాలని వ్యాఖ్యానించారు. బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, పాయల్ శంకర్ తమ పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధిష్ఠానంపై మాట్లాడితే పదవులు పోతాయనే భయంతో ఉన్నారా అని ప్రశ్నించారు.

**బిహార్ ఎన్నికల తర్వాత మాట తప్పారు**

బిహార్ ఎన్నికలకు ముందు దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని 2025 ఏప్రిల్ 1న కేంద్రం ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల తర్వాత కేంద్రం మాట తప్పిందని ఆరోపించారు. కులగణనపై ఏఐసీసీ చేపట్టిన 100 రోజుల కార్యక్రమాన్ని తెలంగాణలో విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.

# విద్యుత్ ఉద్యోగుల నోటికి తాళం!

- ఇప్పుడు ట్రాన్స్కోలో వాటాను విక్రయించనున్నారన్నారంటూ ప్రచారం
- నిర్బంధ ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలి
- లేకుంటే రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామని విద్యుత్ సంఘాల అల్టిమేటం

**మొదటిపేజీ తరువాయి**

**అక్రమాలు, ప్రైవేటీకరణ కుట్రలను దాచేందుకేనా?**

ఈ రకమైన నిర్బంధ ఉత్తర్వుల వెనుక సంస్థలో సాగుతున్న ఉద్యోగ వ్యతిరేక నిర్ణయాలు, ఉన్నత స్థాయి అవినీతి బండారం బయటపడకుండా ఉండేందుకేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ శాఖను అంచెలవారీగా కార్పొరేట్ శక్తులకు, ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు తెరవెనుక భారీ కుట్ర జరుగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి. సంస్థ అంతర్గత లోపాలు, అడ్డగోలు నిర్ణయాలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉద్యోగుల గొంతు నొక్కేందుకే యాజమాన్యం ఈ విధంగా నోటికి తాళం వేస్తోందని కార్మికులు మండిపడుతున్నారు. పాలనలో పారదర్శకత లేకపోవడం వల్లే ఇలాంటి తుగ్లక్ ఆదేశాలకు తెరతీశారని విద్యుత్ ఇంజనీర్ల సంఘాలు సైతం విమర్శిస్తున్నాయి.

**రైతు డిస్కమ్ వివాదం.. ప్రైవేటీకరణకు తొలి అడుగు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే నిధుల సమీకరణ పేరుతో విద్యుత్ రంగంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైతుల కోసం ప్రత్యేక డిస్కమ్ అంటూ ఉచితంగా సరఫరా అవుతున్న వ్యవసాయ విద్యుత్, మిషన్ భగీరథ, హైదరాబాద్ తాగునీటి సరఫరా, కాళేశ్వరం ఎత్తిపోతల సర్వీసులన్నింటినీ ఒకే గొడుగు కిందికి తెచ్చింది. నయాపైసా ఆదాయం లేని వ్యవసాయ సర్వీసులను రైతు డిస్కమ్‌కు బదలాయించి, కాసుల వర్షం కురిపించే గృహ, వాణిజ్య, పారిశ్రామిక కేటగిరీలను మిగిలిన రెండు డిస్కమ్‌లలో ఉంచడం వెనుక.. భవిష్యత్తులో టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్‌లను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించే ఆలోచన దాగి ఉందని ఉద్యోగ సంఘాలు మొదట్లోనే బహిర్గతం చేశాయి. రెగ్యులేటరీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగడం కార్మికుల్లో తీవ్ర అభద్రతాభావాన్ని నింపింది.

**వైటీపీఎస్‌లో జెన్‌కో మొండిచేయి..**

మరోవైపు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలైన జెన్‌కో ప్లాంట్లలోనూ ప్రైవేటు శక్తులను దొడ్డిదారిన చొప్పించే ప్రయత్నాలు తీవ్ర ఉద్యమానికి దారితీశాయి. దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలో కోల్ ప్లాంట్, యాష్ ప్లాంట్ నిర్వహణను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు యాజమాన్యం టెండర్లు పిలిచింది. యాజమాన్యం నిర్ణయించిన ధర కంటే రూ.70 కోట్లు తక్కువ వ్యయంతోనే సంస్థ రెగ్యులర్ ఉద్యోగులతో సమర్థవంతంగా ఈ పనులన్నీ పూర్తి చేస్తామంటూ ఉద్యోగులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆధారాలతో సహా వివరించారు. అయినప్పటికీ ప్రజాధనాన్ని వృథా చేస్తూ అధిక ధరలకు ప్రైవేటు ఏజెన్సీలకే కట్టబెట్టేందుకు ప్రయత్నించడం వెనుక ముడుపుల మాయాజాలం దాగి ఉందని, దీనిపై ప్రశ్నించినందుకే తమపై ఆంక్షలు విధిస్తున్నారని కార్మికులు నిలదీస్తున్నారు.

**ట్రాన్స్‌కోలో వాటాల విక్రయం?**

ఇప్పుడు ట్రాన్స్‌కోలోనూ వాటాల విక్రయానికి రంగం సిద్ధమవుతోందన్న ప్రచారం ఉద్యోగ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో పేరుకుపోయిన రుణాలపై వడ్డీల భారం తగ్గించుకునే పేరుతో డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ను తయారు చేయాలని ట్రాన్స్‌మిషన్ సంస్థ నిర్ణయించింది. దీనికోసం ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్ అనే బహుళజాతి కన్సల్టెన్సీని నియమించేందుకు పవర్ కో ఆర్డినేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో ఆస్తుల్లో ఇతర సంస్థలకు వాటాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్న తరుణంలో, వడ్డీల తగ్గింపు ముసుగులో సంస్థ ఈక్విటీని, ఆస్తులను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు విక్రయించే కుట్ర జరుగుతోందన్న సమాచారం గుప్పుమంది. ఈ సమాచారం మీడియాకు పొక్కకూడదనే ఉద్దేశంతోనే డైరెక్టర్ శ్రీనివాసులు ఆగమేఘాల మీద నిషేధాజ్ఞల ఉత్తర్వును తెరపైకి తెచ్చారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**వెనక్కి తగ్గకుంటే ఉద్యమబాటే శరణ్యం..**

సంస్థ రుణాలు, వడ్డీలు తగ్గించేందుకు చేసే ప్రయత్నాలను ఎవరూ తప్పుపట్టకపోయినా.. దాని మాటున ప్రైవేటీకరణ ప్రయత్నాలు సాగిస్తూ, ఉద్యోగుల గొంతు నొక్కేలా మాట్లాడే హక్కును కాలరాయడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని ఉద్యోగ సంఘాల నేతలు స్పష్టం చేస్తున్నారు. యాజమాన్యం తక్షణమే స్పందించి వివాదాస్పద ఉత్తర్వులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, ఉద్యోగులను విశ్వాసంలోకి తీసుకుని ఆర్థిక ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. నియంతృత్వ పోకడలతో నోటికి తాళం వేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని, విద్యుత్ వ్యవస్థను స్తంభింపజేసైనా ప్రజా ఆస్తులను కాపాడుకుంటామని హెచ్చరిస్తున్నారు.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

**కొడంగల్, సెప్టెంబర్ 5 :**

విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే అసలైన పునాదులు వేస్తారని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తల్లిదండ్రుల కంటే విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దనే ఎక్కువ సమయం గడుపుతారని, సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన విధంగా సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకమైనదని కొనియాడారు. విద్యాభివృద్ధిలో గతంలో 28 వ స్థానంలో ఉంటే ప్రజా ప్రభుత్వం వచ్చాక 17 వ స్థానానికి చేరుకుంది.. ఇది ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యమైంది అని అన్నారు. ఈ రెండేళ్లల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 88 వేలు పెరిగిందని, ఈ విజయం మీది.. తెలంగాణ ప్రజలది అని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం అడ్మిషన్లు జరిగాయన్నారు.

**రోడ్డెక్కవద్దు.. సమస్యలు పరిష్కరిస్తా**

55 రోజుల్లోనే డీఎస్సీ ద్వారా 10,006 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతోపాటు 25,950 మందికి ప్రమోషన్లు, 34,706 మందికి పారదర్శకంగా బదిలీలు చేపట్టామని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు రోడ్డెక్కడం రాష్ట్రానికి శుభసూచకం కాదని, వారికి ఎలాంటి చిన్న సమస్య రాకుండా చూసుకునే బాధ్యత తనదేనని సీఎం హామీ ఇచ్చారు. ఆర్థిక వెసులుబాటును బట్టి సమస్యలన్నీ పరిష్కరిస్తానని, విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు తనకు రెండేళ్ల సమయం ఇవ్వాలని కోరారు. ప్రైవేటుకు దీటుగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. 317 జీవో సమస్యను పరిష్కరించాం.. విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని, కే కేశవరావును సలహాదారుగా నియమించి విద్యాశాఖ సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎడ్యుకేషన్ పాలసీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.. మీ సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వంపై మీ అభిప్రాయం మార్చుకోవద్దు అని కోరారు. మేం అధికారంలోకి రాగానే పీఆర్సీ ఇచ్చామని, మళ్లీ ఇప్పుడు పీఆర్సీ ఇవ్వాలని శ్రీపాల్ అంటున్నాడని అన్నారు. మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా మీ సర్వీస్‌ను 60 ఏళ్లకు గత పాలకులు పెంచారని, మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్ పెట్టి వెళ్లి ఆయన ఫామ్ హౌస్ లో పడుకున్నారని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రజా ప్రభుత్వం రూ.6 వేల కోట్లు చెల్లించిందని చెప్పారు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ ఖర్చులతో విదేశాలకు పంపి విద్యా విధానం అధ్యయనం చేయించారా? తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులను విదేశాలకు పంపింది నిజం కాదా అని అడిగారు. ఉపాధ్యాయుల కు గుర్తింపు ఇవ్వాలని, వారిని గౌరవించాలని 123 మంది టీచర్లకు అవార్డులు అందిస్తున్నామన్నారు.

**ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి**

కొడంగల్ లోని తన నివాసంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ కలసి రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల ఓట్లను, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఒక్క పేదవాడి ఓటు కూడా తొలగింపునకు గురికాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# అసెంబ్లీ సమావేశాలకు సహకరించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

సోమవారం నుండి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ, శాసన పరిషత్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు అధికార్లు సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారుల తో శనివారం శాసన పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలి. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలి. సభ్యులకు అందించే మెటీరియల్ ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో ముందస్తుగా సమర్పిస్తే సభ్యులు చదువుకుని సమావేశాలకు హాజరవుతారు. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలి. శాసనసభ, శాసన మండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సజావుగా జరుగుతాయని గుర్తుచేశారు. తెలంగాణ పోలీసు శాఖకు దేశ వ్యాప్తంగా సమర్థవంతమైనదిగా పేరుంది. ఈసారి సమావేశాలు కూడా విజయవంతంగా జరగడానికి అవసరమైన రక్షణ,బందోబస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నాన్నారు. శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మాదిరిగా కాకుండా ఇంకా వేగంగా అధికారులు పని చేయాలన్నారు. సమావేశాలు జరిగే సమయంలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి. నోడల్ అధికారులను నియమించి , సమావేశాలు సక్రమంగా నిర్వహించాలి. ఈ సారి సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉంది. పోలీస్ శాఖ చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇంటెలిజెన్స్ అధికారులు త్వరగా సమాచారం అసెంబ్లీ అధికారులకు అందించాలి. ధర్నాలు , రాస్తారోకోలు జరగకుండా ప్రశాంతంగా సమావేశాలు జరిగేలా అధికారులు చూడాలన్నారు. శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ చైర్మన్, స్పీకర్ సూచనలను ఖచ్చితంగా అమలు చేయాలి. ఒకరోజు ముందే సంబంధిత ప్రశ్నలకు జవాబులను అందజేయాలి. ఉభయ సభల సమావేశాల సమయంలో ప్రభుత్వం బాధ్యతగా ఉంటూ పూర్తి స్థాయిలో సహకరిస్తాం. ప్రతి శాఖ తరుపున ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు ఉభయ సభల సమావేశాలు నిదర్శనం. అందుకే ప్రభుత్వ యంత్రాంగం తరుపున పటిష్టమైన చర్యలు తీసుకుని సమావేశాలు విజయవంతంగా జరపడానికి సహకరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గా, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ , కౌన్సిల్ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసన పరిషత్ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, డిజిపి సివి ఆనంద్, (ప్రిన్సిపల్ సెక్రటరీ హోం) శిఖా గోయల్, లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, అడిషనల్ డీజీ(ఇంటెలిజెన్స్) విజయకుమార్, సిటీ కమిషనర్ విసి సజ్జనార్, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, మార్షల్స్ కర్ణాకర్, సంజీవ రెడ్డి తదితరులు కూడాపాల్గొన్నారు.



# హనీట్రాప్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

- డేటింగ్ యాప్ పరిచయంతో రూ.14.75 లక్షలు మోసం
- 'లావణ్య' పేరుతో వల వేసిన నిందితుడు
- తమిళనాడు సేలంలో నిందితుడి అరెస్టు
- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

**వరంగల్, సెప్టెంబర్ 5:**

డేటింగ్ యాప్‌లో పరిచయమైన మహిళ పేరుతో ఓ వ్యక్తి వేసిన హనీట్రాప్‌లో పడి వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.14.75 లక్షలు పోగొట్టుకున్నాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని తమిళనాడులోని సేలం జిల్లాలో అదుపులోకి తీసుకున్నారు.

**డేటింగ్ యాప్‌లో పరిచయం**

వరంగల్‌కు చెందిన తుమ్మ ఉదయ్ కిరణ్‌కు వై99 డేటింగ్ యాప్‌లో 'లావణ్య' పేరుతో ఓ మహిళ పరిచయమైంది. కొంతకాలానికి పరిచయం స్నేహంగా మారడంతో ఇద్దరూ తరచూ చాటింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో లావణ్య పేరుతో ఉన్న వ్యక్తి డబ్బులు కావాలని అడగడంతో ఉదయ్ కిరణ్ పలు దఫాలుగా యూపీఐ, ఇతర మార్గాల ద్వారా మొత్తం రూ.14.75 లక్షలు పంపించాడు.

**మహిళ పేరుతో మోసం**

చివరకు తాను మోసపోయినట్లు గుర్తించిన ఉదయ్ కిరణ్ వరంగల్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇది హనీట్రాప్ వ్యవహారమని గుర్తించారు. లావణ్య పేరుతో ఓ వ్యక్తి బాధితుడిని వలలోకి దించి వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీల ద్వారా రూ.14 లక్షలకు పైగా దోచుకున్నట్లు నిర్ధారించారు.

**సేలంలో నిందితుడి అరెస్టు**

సాంకేతిక ఆధారాలతో నిందితుడు తమిళనాడులోని సేలం జిల్లాలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగింది. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శివకృష్ణ, దినేశ్, భరత్, జహూర్ మొహమ్మద్ నిందితుడి పట్టివేతలో కీలకంగా వ్యవహరించారు.

**అప్రమత్తంగా ఉండాలి**

డేటింగ్ యాప్‌లు, సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పంపవద్దని పోలీసులు సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులు అత్యవసర పరిస్థితులు, వ్యక్తిగత అవసరాల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# ఎలక్ట్రానిక్ జాకార్డ్‌తో కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గం ఆవిష్కరణ

- **సిరిసిల్ల నేతన్నకు కేటీఆర్ ప్రశంసలు**
- **'వెండి వెన్నెల' చీర ఆవిష్కరణ**
- **అధికారంలోకి వస్తే కర్మాగారం నెలకొల్పుతాం**
- **కేటీఆర్ హామీ**

**సిరిసిల్ల, సెప్టెంబర్ 5:**

చేనేత రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ కొత్త తరహా హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని రూపొందించిన నేతన్న నల్లా విజయ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. విజయ్ ఆహ్వానం మేరకు సిరిసిల్లలోని ఆయన ఇంటికి వెళ్లిన కేటీఆర్.. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కొత్త హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని పరిశీలించి ఆవిష్కరించారు. ఈ మగ్గంపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కూడా కేటీఆర్ ఆవిష్కరించారు. ఒకప్పుడు సిరిసిల్లలో అగ్గిపెట్టెలో పట్టే చీరను నేసిన మహానుభావుడు నల్లా పరంధాములు అని కేటీఆర్ గుర్తుచేశారు. ఆయన కళా నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా సిరిసిల్లకు గుర్తింపు తీసుకొచ్చిందన్నారు. సిరిసిల్లలో ఇంత అద్భుతమైన కళాకారులు ఉన్నారా అని ప్రపంచం ఆశ్చర్యపడేలా పరంధాములు చేనేత కళను చాటారని పేర్కొన్నారు. నల్లా పరంధాములు వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు నల్లా విజయ్ అనేక వినూత్న ప్రయోగాలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. చేనేత కళాకారుల నైపుణ్యానికి ఆధునిక సాంకేతికతను జోడించి మెరుగైన ఉత్పత్తులను అందించాలనే తపనతో విజయ్ ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తున్నారని ప్రశంసించారు. ప్రస్తుతం 'షిఫ్ట్ జాకార్డ్' పేరుతో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వెండి, బంగారంతో ప్రత్యేకమైన చీరలను రూపొందిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. 'వెండి వెన్నెల' పేరుతో రూపొందించిన చీర అద్భుతంగా ఉందని, విజయ్ నైపుణ్యం, సృజనాత్మకతను అభినందించేందుకు, ఆయన చేసిన ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూడాలనే ఉద్దేశంతో ఆహ్వానం మేరకు ఇక్కడకు వచ్చానని చెప్పారు. విజయ్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానని కేటీఆర్ అన్నారు. గతంలోనూ విజయ్‌ను ప్రోత్సహించానని, భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విజయ్ కోసం సిరిసిల్లలో ఒక అద్భుతమైన కర్మాగారం ఏర్పాటు చేసి, అవసరమైన అన్ని రకాల సబ్సిడీలు అందించడంతో పాటు ఈ పరిశ్రమను మరింత మంది నేతన్నలు అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తానని కేటీఆర్ తెలిపారు. విజయ్‌తో పాటు సిరిసిల్ల చేనేత కళను కాపాడి, మరింత అభివృద్ధి చేసే ప్రయత్నాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లను కేవలం పవర్‌లూమ్ పరిశ్రమకే పరిమితం చేయకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన హ్యాండ్‌లూమ్ చేనేతకు కూడా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విజయ్ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో మగ్గంపై పని వేగం పెరగడంతో పాటు నేతన్నల శ్రమ తగ్గుతుందని విజయ్ తెలిపారు. ముఖ్యంగా మహిళా కార్మికులకు పని సులభతరం అవుతుందని, తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. కొత్త సాంకేతికతతో రూపొందిస్తున్న ప్రత్యేకమైన చీరలకు వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని, తద్వారా నేతన్నలకు అదనపు ఆదాయం సమకూరుతోందన్నారు.

చేనేత రంగాన్ని ప్రోత్సహించడంలో కేటీఆర్ ఎప్పుడూ ముందుంటారని విజయ్ తెలిపారు. గతంలో తాము రూపొందించిన వినూత్న చీరలను కూడా కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించామని, ఈసారి ఎలక్ట్రానిక్ జాకార్డ్ టెక్నాలజీతో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ మగ్గాన్ని, దానిపై రూపొందించిన 'వెండి వెన్నెల' చీరను కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.




# వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి**

లో అక్టోబర్ 1 నాటికే రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో శనివారంనిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రేడ్ఏ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధరగా నిర్ణయించింది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఏడు ప్రాధాన్య సన్న రకాలకు (బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, కేఎన్ఎమ్1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీసోనా, డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎమ్7715) క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నది.

**దిగుబడి అంచనాలు**

ఈ వానాకాలంలో 57.70 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌర సరఫరాల సంస్థ ద్వారా 45 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేయనున్నారు. తెలంగాణ బియ్యానికి దేశీయంగానే కాక అంతర్జాతీయ స్థాయిలో స్థిరమైన ఎగుమతి మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు దీర్ఘకాలిక వ్యూహాన్ని రూపొందించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు.

**రవాణా, నిల్వ ఏర్పాట్లు**

ఈ సీజన్‌కు అవసరమైన 16.25 కోట్ల గన్నీ సంచులను వేగవంతంగా సేకరించాలని, ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా సరిహద్దు చెక్ పోస్టులను మరింత బలోపేతం చేయాలన్నారు.

**సకాలంలో చెల్లింపులు**

తూకం, నాణ్యత పరీక్షల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు నగదు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంచాలకుడు శ్యామ్ ప్రసాద్, అదనపు సంచాలకుడు రోహిత్ సింగ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలి?

**మొదటిపేజీ తరువాయి**

రోజుల దగా పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన యువ సమరభేరిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను నిండాముంచిన లఫంగా పార్టీ కాంగ్రెస్ అని తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఆ రోజు కూడా ఇదే కరీంనగర్‌లో, 2006లో ఇదే కాంగ్రెస్ వాళ్లు కేసీఆర్ రాజీనామా చేయాలని మాట్లాడారు. ఇదే కరీంనగర్ గడ్డ మీద కేసీఆర్ రాజీనామా చేస్తే ఏమైందో గుర్తుందా? 2006లో కాంగ్రెస్ వీపు పగిలింది. ఎవడు కొడితే దిమ్మ తిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో.. అగో ఆయననే కేసీఆర్.. ఆయనతో పెట్టుకోవద్దు. ఇప్పుడు కేసీఆర్‌తో పెట్టుకుంటే రేవంత్ రెడ్డి మళ్లీ అదే అవుతది. యాదిలో పెట్టుకో! చేసిన మోసాలకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు 420 హామీలకు 420 సార్లు రాజీనామాలు చేయాలి. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదు.. మీ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయి. గుర్తుపెట్టుకోండి.. నేను కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నా. పోరాటాలకు పుట్టినగడ్డ కరీంనగర్. కరీంనగర్ నుంచే కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలుపెట్టారు. యువతతో పెట్టుకుంటే పెద్దపెద్ద వాళ్లే దిగిపోయారు. ఉడుకు నెత్తురు ఉరకలెత్తే పోరాటం పోటెత్తుతుంది. యువత పిడికిలి బిగిస్తే పిడుగుల వర్షం కురుస్తుంది. మాకు స్కిల్ లేదని ఎవరు చెప్పారు? సీఎంకు స్కిల్ ఉందా అని విద్యార్థులు అడుగుతున్నారన్నారు. సీఎం రేవంత్‌కు దరఖాస్తు కూడా రాయడం రాదు. అక్షర దోషం లేకుండా ఏ భాషలోనూ రాయలేడు రేవంత్. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తాం. కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని పదేళ్లు అభివృద్ధిలో నడిపించాం. అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో అనుకోని ఘోరం జరిగింది. తెలంగాణ ఇవ్వకుండా వేలాది ప్రాణాలు బలిగొన్న ముసలి నక్క కాంగ్రెస్. ముసలి నక్క కాంగ్రెస్ జిత్తులతో అధికారంలోకి వచ్చింది. నిరుద్యోగుల మీద దొంగ ప్రేమ కురిపించారు. దేశం వదిలించుకున్న కాంగ్రెస్ పార్టీ పొరపాటు వల్ల మన నెత్తిన కూర్చుంది. కాంగ్రెస్‌కు జాక్‌పాట్.. తెలంగాణకు గ్రహపాటు అయ్యింది. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలన్నారు.. వచ్చాయా? యూత్ కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు.. చేశారా? ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ చట్టం తెస్తామన్నారు.. తెచ్చారా? కాలేజీ అమ్మాయిలకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10 లక్షల రుణాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా? ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందా? రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు.. ఇచ్చారా? అప్పుడు యూత్ డిక్లరేషన్.. ఇప్పుడు రేవంత్ బూతు డిక్లరేషన్. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే బూతులు మాట్లాడుతున్నాడు. మోసం చేసిన కాంగ్రెస్ నేతలను యువత పీకేసి చింతకు కట్టాలి. పందికొక్కుల్లాగా తినడం తప్ప కాంగ్రెస్ నేతలు చేసిందేమీ లేదు. తిన్నది అరగక కేసీఆర్ రాజీనామా చేయాలంటున్నారు. 1000 రోజులైనా హామీలు అమలు చేయలేని రేవంత్ రాజీనామా చేయాలి. నిరుద్యోగులను నిండా ముంచి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఉద్యోగాలు ఏమయ్యాయని అడిగితే బూతులు మాట్లాడుతున్నాడు. సీఎం, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు. గాలి మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చారు. దండం పెట్టి ఓట్లేసిన ఉద్యోగులే మీకు పిండం పెడతారు. కాంగ్రెస్ కొన్ని తరాలపాటు కనిపించకుండా పోయే రోజు యువత చెప్పాలి. సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అశోక్‌నగర్‌లో రాహుల్ అన్నారు. ఒట్టు పెట్టుకొని అధికారంలోకి వచ్చారు. రాహుల్ గాంధీ. రేవంత్ దగ్గర నెలకోసారి పైసలు తీసుకొని సీఎం సీటును రెన్యువల్ చేస్తున్నారు. రాహుల్ మూటలు తీసుకుంటూ అన్నీ మూసుకొని ఢిల్లీలో కూర్చున్నాడు.

# 22ఏలో చేర్చడం మానవ హక్కుల ఉల్లంఘనే

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

భూభారతి 22ఏ ద్వారా రైతుల భూములను అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భూభారతి, 22ఏపై శనివారం మహాధర్నా నిర్వహించారు. శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ మహా ధర్నాలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భూభారతి, 22ఏ నిషేధిత జాబితా పేరుతో మధ్యతరగతి కుటుంబాలను, రైతులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. గత బీఆరఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో ఒక బ్లాక్‌లిస్టెడ్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి వ్యవస్థను అప్పగించి అవకతవకలకు పాల్పడితే ఆ లోపాలను సరిదిద్దేందుకు భూభారతి తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మరింత ఘోరంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో 15 శాతం కమీషన్లతో నిషేధిత జాబితాలోని భూములను తొలగిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో 30 శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, మంత్రులే స్వయంగా ఒప్పుకుంటున్నప్పుడు అందుకు బాధ్యులైన ప్రభుత్వానికి శిక్ష పడాల్సిందేనని అన్నారు. రైతులే కాక మల్కాజిగిరి వంటి ప్రాంతాల్లో చిన్నచిన్న ప్లాట్లు కొనుక్కుని నిర్మించుకున్న మధ్యతరగతి ప్రజల ఇళ్లను, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని నిర్మాణాలను కూడా 22ఏ జాబితాలో చేర్చడం శోచనీయ మని అన్నారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు భూముల పేరు చెప్పి ప్రైవేట్ పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక ప్రభుత్వ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఏదైనా సర్వే నంబర్‌లో కొంత భాగంపై వివాదం ఉంటే ఏకంగా మిగతా సర్వే నంబర్ మొత్తాన్ని నిషేధిత జాబితాలో చేర్చి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కడుపు కొట్టేలా సాగుతున్న ఈ అక్రమాలపై వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, రైతులు సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే కలెక్టర్లు సమయం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది తమ భూములను అమ్ముకోలేక, పిల్లల ఉన్నత చదువులు లేదా పెళ్లిళ్ల కోసం రుణాలు తీసుకోలేక తీవ్ర క్షోభకు గురవుతున్నారన్నారు. సొంత భూమిపై హక్కు అనేది రాజ్యాంగబద్ధమైన మానవ హక్కు అని, రాష్ట్ర ప్రభుత్వం ఆ హక్కులను తుంగలో తొక్కుతోందని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడితే, కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి అండ్ బ్రదర్స్ మాత్రమే బాగుపడుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం లేకనే సభను రెండు రోజులకే పరిమితం చేస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ధర్నాలకు కూడా అనుమతులు ఇవ్వడానికి భయపడుతోందని అన్నారు. 22ఏలోని రైతుల, ప్రజల భూములన్నింటినీ తక్షణమే విముక్తి చేయాలని, లేనిపక్షంలో సడక్ నుంచి సదన్ వరకు బీజేపీ రాజీ లేని పోరాటం చేస్తుందని రామచందర్ రావు హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డి.కె.అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేష్, ఎమ్మెల్యేలు కె.వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, ఎమ్మెల్సీ కొమురయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అశోక్, డాక్టర్ గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పాల్గొన్నారు.

**'ఆర్ఆర్ రియల్ ఎస్టేట్'గా మార్చారు: కిషన్ రెడ్డి ఆగ్రహం**

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజల భూములను అక్రమంగా నిషేధిత 22ఏ జాబితాలో చేర్చి 'రేవంత్ రెడ్డి - రాహుల్ గాంధీ ప్రైవేట్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అన్ని అనుమతులు ఉండి పన్నులు చెల్లిస్తున్న పేదల నివాసాలను, భూములను రాత్రికి రాత్రే 22ఏ జాబితాలోకి నెట్టడం దుర్మార్గమని, వీటిని బేషరతుగా తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ, మౌలానా ఆజాద్ ఉర్దూ వర్సిటీ, హౌసింగ్ బోర్డు, దేవాదాయ శాఖ భూములతోపాటు పార్కులు, కమ్యూనిటీ స్థలాలను వేలం పేరుతో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. భూములు అమ్మితే తప్ప ప్రభుత్వం నడవని దుస్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. 22ఏ భూములు, ప్రైవేట్ సెటిల్మెంట్ల ద్వారా వసూలు చేసిన వేలాది కోట్ల ప్రజాధనాన్ని కాంగ్రెస్ అధిష్టానానికి, ఇతర రాష్ట్రాల ఎన్నికల ఖర్చులకు తరలిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించడం వల్లే ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇవ్వలేకపోతున్నదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఖమ్మంలో రిటైర్డ్ పోలీసులు ఆత్మహత్యలు చేసుకునే స్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక పార్టీకి కొమ్ముకాస్తూ పేదల భూములను 22ఏ జాబితాలోకి నెట్టిన అధికారుల, నేతల అక్రమాల సమాచారం తమ వద్ద భద్రంగా ఉందన్నారు. 2029లో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రతి పైసా లెక్క తేల్చి పేదలకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. 22ఏ అక్రమాలపై కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు.

**రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలి : డాక్టర్ లక్ష్మణ్**

కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వంలా కాక రియల్ ఎస్టేట్ సంస్థలా వ్యవహరిస్తోందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ మండిపడ్డారు. భూములన్నింటినీ అమ్మకాలకు పెట్టి రాబోవు తరాల భవితవ్యాన్ని నాశనం చేయడంతోపాటు ఖాళీ భూములు, ఎండోమెంట్, అసైన్‌మెంట్ భూములపై కూడా కన్నేశారని ధ్వజమెత్తారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజ కవర్గం పరిధిలోని కొర్రెంల గ్రామ దళితులు అధికారుల వద్దకు వెళ్తే స్థానిక కాంగ్రెస్ నాయకులు, దళారులు రంగప్రవేశం చేసి ఐదెకరాలు ఉంటే మూడెకరాలు వదులుకోవాలంటూ బెదిరింపులకు, సెటిల్మెంట్లకు దిగుతున్నారని ఆరోపించారు. బీఆరఎస్ ప్రభుత్వం ఎన్టీఆర్ మైదానంలో భారీ మాల్, ఫుడ్‌కోర్టులు నిర్మించాలని చూస్తే నాడు ఎమ్మెల్యేగా తాను అడ్డుకున్నానని, అందువల్లే నేడు అది ప్రజలకు మిగిలిందని గుర్తు చేశారు. ముషీరాబాద్, ఆజామాబాద్ ఏరియాలోని పరిశ్రమల భూములను, వీఎస్టీ, అగర్వాల్ ఇండస్ట్రీస్, హెచ్‌సీయూ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్రలపై రాజ్యసభలో గళమెత్తి అడ్డుకున్నామన్నారు. లక్షలాది కుటుంబాల ఆవేదనకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలని, 22ఏలో చేర్చిన భూములను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎండోమెంట్, అసైన్డ్ భూములను చట్టబద్ధమైన హక్కుదారులకే దక్కేలా పూర్తి న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.



# భవిష్యత్తు డేటా, ఏఐ రంగాలదే

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ముఖ్యంగా డేటా, డేటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు(ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు(కేటీఆర్) అన్నారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులనుద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల కోణాల నుంచి రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూసిన అనుభవం ఉందని, ప్రస్తుతం ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి అద్భుతమైన భవిష్యత్ ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్ జోన్లలో పనిచేస్తూ అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసన్నారు. కాన్‌స్టర్ పేరుపై సరదాగా స్పందించిన ఆయన సంస్థ పేరు వెనుక ఉన్న 'కన్వర్జెన్స్ ఆఫ్ స్టోరేజ' భావన తనకు ఆసక్తికరంగా అనిపించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ వినియోగం, ఉత్పత్తి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దాని నిల్వ చేయడం, నిర్వహించడం, ప్రపంచానికి చేరవేయడంలో కాన్‌స్టర్ వంటి సంస్థలకు కీలక పాత్ర ఉంటుందన్నారు. గతంలో వార్తాపత్రికలను పేజీపేజీగా చదివే రోజులు ఉండేవని, ఇప్పుడు యువతరం మొబైల్ ఫోన్‌లో ఒక్కోసారి స్వైప్ చేస్తూ ప్రపంచాన్ని చూస్తోందని తెలిపారు. ప్రతి స్వైప్ వెనుక భారీ స్థాయిలో కంటెంట్ ఉత్పత్తి, నిల్వ, పంపిణీ జరుగుతోందని, ఈ డిజిటల్ విప్లవంతో డేటా, స్టోరేజ్ రంగాల ప్రాధాన్యత మరింత పెరుగుతోందని చెప్పారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ టైర్ 2, టైర్ 3 నగరాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని కేటీఆర్ చెప్పారు. చిన్న పట్టణాలు, నగరాల నుంచి వచ్చే యువతలో అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆకలి, పట్టుదల ఎక్కువగా ఉంటుందని అన్నారు. ప్రతిభావంతులైన యువతను ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు తీసుకురావడం కంటే కంపెనీలు వారివద్దకే వెళ్లి అవకాశాలు కల్పించాలని సూచించారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో టైర్ 2 నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించాలనే లక్ష్యంతో అనేక ఐటీ హబ్‌లను నిర్మించామని కేటీఆర్ గుర్తు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువతకు వారి స్వస్థలాల్లోనే ఉద్యోగావకాశాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పని చేసే విధానాన్నే పూర్తిగా మార్చేసిందన్నారు. ఒకప్పుడు కార్యాలయానికి వచ్చి ఒకేచోట కలిసి పనిచేస్తేనే పనులు జరుగుతాయని భావించేవాళ్లమని, కానీ కోవిడ్ తర్వాత ప్రపంచంలో ఎక్కడినుంచైనా పనిచేసి సమర్థవంతంగా ఫలితాలు సాధించవచ్చని నిరూపితమైందని అన్నారు. టైర్ 2, టైర్ 3 నగరాలు, చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఉన్న సరైన ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పిస్తే సంస్థలు అద్భుతంగా ఎదగగలవన్నారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ తన ఉద్యోగుల సంఖ్యను మరింత విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతుండటం అభినందనీయమన్నారు. ఊహాశక్తి, ఆశయం, అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యమే ఒక సంస్థ ఎదుగుదలను నిర్ణయిస్తుందని చెప్పారు. కాన్‌స్టర్ వ్యవస్థాపకులు, నాయకత్వ బృందం, ఉద్యోగులకు కేటీఆర్ అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో సంస్థ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# రోడ్లపై వంటావార్పుతో తెలంగాణ వచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మేము గొంతెమ్మ కోరికలు కోరడం లేదు, ఎన్నికల్లో మీరు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కేసీఆర్ లాగా రైతులకు అండగా ఉండాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నామన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో కరెంట్ అంటే ఒక లెక్క లేకుండా 24 గంటలు బాయి కాడ కరెంట్ ఉండేది. ఇప్పుడు పొద్దున లేస్తే కరెంట్ కోసం ఫోన్లు వస్తున్నాయి. ఎనిమిది గంటలు కూడా సరిగ్గా కరెంట్ రాక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ పాలన, పాత రోజులు తెస్తానన్న రేవంత్ రెడ్డి.. నిజంగానే కరెంట్ కష్టాలతో పాత రోజులను వెనక్కి తెచ్చాడు.లాక్ డౌన్ లో ఇళ్లలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్ రైతుబంధు ఆగనివ్వలేదు. ఎమ్మెల్యేల జీతాలు, ఉద్యోగుల జీతాలు సగం ఆపినా, కాంట్రాక్టర్ల బిల్లులు ఆపినా రైతులకు మాత్రం పక్కాగా రైతుబంధు అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. ఓట్ల కోసం కేసీఆర్ ఏనాడు రైతుబంధు ఇస్తానని మాట ఇవ్వలేదు. కానీ రైతుల కష్టం చూసి రైతుబంధు ప్రారంభించారు. రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే నేను రూ.15 వేలు ఇస్తానని చెప్పి, ఉన్నదాన్నే ఎగ్గొట్టాడు. ఈ మూడేళ్లలో రేవంత్ రెడ్డి రైతులకు ఎగ్గొట్టిన రైతుబంధు అక్షరాలా రూ. 29 వేల కోట్లు. పాముకాటుకో, కరెంట్ షాక్ తోనో రైతు చనిపోతే ఏ కష్టం లేకుండా రూ. 5 లక్షలు ఇచ్చే రైతు బీమా ఇప్పుడు ఏమైంది. ఈ నెల 13న ప్రీమియం కట్టకుండా రేవంత్ రెడ్డి రైతుల బీమాను బంద్ చేశాడు. దుకాణానికి వెళ్లి నాలుగు సంచుల యూరియా తెచ్చుకునే రోజులు పోయాయి. ఇప్పుడు యాప్ లలో బుక్ చేస్తే 15 రోజులకు గానీ డీఏపీ, యూరియా దొరకని దౌర్భాగ్య పరిస్థితి దాపురించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీఏపీ ధరలను రూ. 900 నుంచి రూ. 2200కి పెంచితే, రాష్ట్ర ప్రభుత్వం యాప్ లతో రైతుల ఉసురు తీసుకుంటోంది. వడ్లు కొనుగోలులో రైతులను మోసం చేస్తూ బస్తాకు 5 కిలోల తరుగు పెడుతున్న మిల్లర్ల చేతిలో ముఖ్యమంత్రి కీలుబొమ్మగా మారాడు. అసెంబ్లీలో తరుగు తీస్తే తోలు తీస్తానన్న ముఖ్యమంత్రి.. నేడు మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నాడు. ఏ పంట పండినా కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ ది. కానీ రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రం ఏది కొనమంటే అదే కొంటానని చేతులెత్తేస్తున్నాడు. కేంద్రం కొనకపోతే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నీ బాధ్యత ఏంటి? చేతకాకపోతే కుర్చీ దిగిపో. రైతులను ఆదుకున్న కేసీఆర్ రైతు బాంధవుడైతే, ఈ వెయ్యి రోజుల పాలనలో రైతుల ఉసురు పోసుకుంటున్న రేవంత్ రెడ్డి ఒక రాబందు లాంటివాడని విమర్శించారు. మండుటెండల్లో మల్లన్న సాగర్ గేట్లు ఎత్తి కూడెల్లి వాగులో నీళ్లు పారించి రైతుల పొలాలను పచ్చగా ఉంచిన భగీరథుడు కేసీఆర్. కానీ రేవంత్ రెడ్డి వచ్చిన మూడేళ్లలో మెదక్, దుబ్బాక, సిద్దిపేటలో ఒక్క ఎకరా కాలువ తవ్వలేదు. మేడిగడ్డ దగ్గర చిన్న పిల్లర్ మరమ్మతు చేయకుండా, మోటార్లు ఆన్ చేయకుండా కావాలనే కాళేశ్వరం ప్రాజెక్టును పడుకోబెట్టాడు. ఇది కేవలం రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు.1000 రోజుల కాంగ్రెస్ పాలనలో 1000 అబద్ధాలు, కబ్జాలు, మోసాలు తప్ప మరేమీ లేదు. దేవుళ్ళ మీద ప్రమాణాలు చేసి మాట తప్పిన రేవంత్ రెడ్డి మనిషేనా? నాలుగు వేల పెన్షన్ ఇస్తానని మోసం చేయడమే కాకుండా, ఉన్న 3 లక్షల 50 వేల పెన్షన్లు తొలగించారు. కేసీఆర్ ఇచ్చిన కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. తులం బంగారం పేరుతో ఆడబిడ్డలను నిలువునా మోసం చేశాడు. కరెంట్, రైతుబంధు, రైతుబీమా ఇవన్నీ మళ్లీ పక్కాగా రావాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలి. కాంగ్రెస్ మోసాలకు రైతులు, మహిళలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

# మల్లికార్జున నగర్‌లో ప్రమాదకరంగా మారిన గుంత

- కారు గుంతలో పడి ప్రమాదం.. వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్




**రామచంద్రపురం, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):**

రామచంద్రపురం డివిజన్ మల్లికార్జున నగర్ కాలనీ వద్ద రహదారి పనుల్లో భాగంగా తొలగించిన కాలనీ ముఖద్వారం సమీపంలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. శుక్రవారం రాత్రి గుంతను గమనించక ఓ కారు అందులో పడటంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే శనివారం ఉదయం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కాలనీ అధ్యక్షుడు రఘురాం రెడ్డి, కార్యవర్గ సభ్యులతో కలిసి ప్రమాదకరంగా మారిన ప్రాంతాన్ని పరిశీలించిన పుష్పనగేష్, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత నేషనల్ హైవే డీఈ రామకృష్ణ, ఏఈ భానుప్రకాష్‌లతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. నేషనల్ హైవే రోడ్డు నుంచి మల్లికార్జున నగర్ కాలనీలోకి వెళ్లే మార్గం సరిగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్నారని అధికారులకు తెలిపారు. వెంటనే రాకపోకలకు ఇబ్బంది లేకుండా గుంతను పూడ్చేందుకు మట్టి లేదా కంకర వేయాలని కోరారు. వాహనదారుల భద్రత దృష్ట్యా సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను సూచించారు.

# మ్యాక్ సొసైటీలో ఘనంగా శివాలయ శంకుస్థాపన

- భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మహోత్సవం.. పాల్గొన్న ప్రముఖులు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):**

భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో శివాలయ నిర్మాణానికి శనివారం భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. శ్రీ కనకదుర్గ శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి సైతం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. శివాలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు ఆధ్యాత్మిక సేవలు అందుబాటులోకి రావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, పరమేష్‌యాదవ్, భాస్కర్ ముదిరాజ్, పాటి సత్యనారాయణ, ఐలేష్‌యాదవ్, ఆలయ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీర్ గార్డియన్-2026కు జపాన్ బలగాలు

- ఇండో-పసిఫిక్ భద్రతకు కీలకంగా మారనున్న సాధన

**జోధ్‌పూర్, సెప్టెంబర్ 5:**

భారత్, జపాన్ వైమానిక దళాల మధ్య ద్వైపాక్షిక వాయుసేన విన్యాసాలు 'వీర్ గార్డియన్2026'కు రంగం సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ వైమానిక స్థావరంలో సెప్టెంబర్ 9 నుంచి 22 వరకు ఈ విన్యాసాలు జరగనున్నాయి. రెండో విడత విన్యాసాల్లో పాల్గొనేందుకు జపాన్ వాయుసేన బృందం శనివారం భారత్‌కు చేరుకుంది. జపాన్ రక్షణ దళానికి చెందిన రెండు సీ2 సైనిక రవాణా విమానాలు జోధ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగగా.. భారత వైమానిక దళ అధికారులు జపాన్ బృందానికి స్వాగతం పలికారు.

**కార్యాచరణ సమన్వయంపై దృష్టి**

విన్యాసాల ద్వారా ఇరు దేశాల వాయుసేనల మధ్య కార్యాచరణ సమన్వయం, పరస్పర అవగాహన మరింత మెరుగుపడుతుందని ఐఏఎఫ్ తెలిపింది. క్లిష్టమైన పరిస్థితుల్లో సంయుక్తంగా కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడమే ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.

**వ్యూహాలు, సాంకేతికతలపై సాధన**

రెండు దేశాల పైలట్లు అత్యాధునిక వైమానిక సాంకేతిక పరిజ్ఞానం, వ్యూహాలను పరస్పరం పంచుకోనున్నారు. వివిధ పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసే విధానాలపై సంయుక్తంగా శిక్షణ పొందనున్నారు. ఈ సాధన ద్వారా ఇరు వాయుసేనల మధ్య పరస్పర కార్యాచరణ సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

**రక్షణ భాగస్వామ్యానికి ఊతం**

ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రతలను బలోపేతం చేయడంలో ఈ విన్యాసాలు కీలకంగా నిలవనున్నాయి.

# దూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్లేట్ల పంపిణీ చేసిన రఘునాథ్

- తాతయ్య మంత్రి ఎల్లయ్య, నానమ్మ కృష్ణమ్మ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం



**దూలపల్లి.సెప్టెంబర్.05(సిరి న్యూస్).**

ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో బీఆర్ఎస్ నాయకుడు మంత్రి రఘునాథ్ సేవా కార్యక్రమం నిర్వహించారు. తన తాతయ్య మంత్రి ఎల్లయ్య, నానమ్మ కృష్ణమ్మ జ్ఞాపకార్థంగా పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి రఘునాథ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులను గౌరవించడంతో పాటు, వారు బోధించే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం కూడా మన బాధ్యత అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.గురువుల సేవలను స్మరించుకునే ఉపాధ్యాయుల దినోత్సవం రోజున విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందించడం ఆనందంగా ఉందన్నారు. పిల్లల కోసం చేసే ప్రతి చిన్న సహాయం వారి భవిష్యత్తుకు పెద్ద అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్లేట్ల పంపిణీతో విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో ఎంతో సౌకర్యం కలగనుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాన్ని చేపట్టిన మంత్రి రఘునాథ్ ను పాఠశాల సిబ్బంది, స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు మాజీ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్ ,మాజీ కౌన్సిలర్ డప్పు కిరణ్, మల్లేష్,పెంటయ్య,రాజు,మహేష్, మధు,జీతేందర్,నాగరాజు,రంజిత్, బాలాజీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





- - అధ్యాపకులకు ఘన సత్కారం..
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

**రామచంద్రపురం(పటాన్‌చెరు), సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):**

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ లైఫ్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుల సేవలను కొనియాడుతూ విద్యార్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యారంగానికి, ప్రజా జీవితానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థులకు జ్ఞానం, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న అధ్యాపకుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థులు, సిబ్బంది నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను యాజమాన్యం శాలువాలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాలతో సత్కరించింది. యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకుల అంకితభావం, సేవలను గుర్తిస్తూ నిర్వహించిన ఈ వేడుక ఘనంగా ముగిసింది.

# లింగంపల్లి -టేక్మాల్ బస్సు సర్వీసు కొనసాగించాలని ధర్నా

- దన్నురా గ్రామంలో నిర్వహించిన బిఅర్ఎస్ నాయకులు!
- సంగారెడ్డి డిఎం హామీతో ధర్నా విరమణ!



**టేక్మాల్ సెప్టెంబర్5, (సిరి న్యూస్)**

లింగంపల్లి నుండి టేక్మాల్ వరకు నడుపుతున్న సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును అర్ధాంతరంగా రద్దు చేయడం వల్ల ప్రయాణికులకు అసౌకర్యంగా మారిందని టేక్మాల్ మండల బి ఆర్ ఎస్ నాయకులు చింత రవి, కమ్మరి సిద్ధయ్య,దాన్నారం బి ఆర్ ఎస్ నాయకులు యోసబ్ ల ఆధ్వర్యంలో శనివారం నాడు ఉదయం ధన్నూర గ్రామంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్సును లింగంపల్లి నుంచి దన్నూర గ్రామం వరకు కాకుండా మండల కేంద్రమైన టేక్మాల్ వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. టేక్మాల్ నుండి హైదరాబాద్ వెళ్లాలంటే వ్యాపారులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థులకు ప్రతి ఒక్కరికి ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.ఈ విషయం తెలుసుకున్న సంగారెడ్డి అర్టిసి డిపో మేనేజర్ ధర్నా చేస్తున్న బిఅర్ఎస్ నాయకులతో మాట్లాడారు. తప్పకుండా బస్సు టేక్మాల్ వరకు కొనసాగిస్తామని హామీ ఇవ్వడం తో ధర్నా విరమించారు.

# 1000 రోజుల పాలనలో ప్రజలకు అందిన ఎన్నో పథకాలు:శివకుమార్



**దూలపల్లి.సెప్టెంబర్.05(సిరి న్యూస్).**

ఈ వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో ఎన్నో పథకాలు ప్రజలకు అందాయని బైరి శివకుమార్ అన్నారు. శనివారం నాడు దూలపల్లి డివిజన్ ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొని స్థానిక ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ గౌడ్ కి సవాల్ విసిరారు.ముందుగా ఎన్టీఆర్ విగ్రహం నుండి కార్యకర్తలతో కలిసి కెసిఆర్ వెంటనే రాజీనామా చేయాలనీ ప్రజలను మరిచి ఫామ్ హౌస్ కి పరిమితం అయినా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి అంబేత్కర్ విగ్రహం వరకు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు అంబేత్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజల పాలనా రేవంత్ రెడ్డి పాలనా అని నాడు కెసిఆర్ అది కుటుంబ పాలనలో కేవలం కెసిఆర్ కుటుంబమే బాగుపడిందని కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో అభివృదికి నోచుకోలేదని అన్నారు.ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ చేసిన వాక్యాలను కాండిస్తు రానున్న రోజుల్లో తెరాస పార్టీకి ప్రజలే బుద్ధి చెప్తారని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఆగ్రహం వ్యక్తం చేసారు,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గడిచిన1000 రోజుల పాలనలో కోట్లాది రూపాయలు వెచ్చించి దూలపల్లిలో రోడ్లు మరమ్మతులకు శంకుస్థాపనలు చేసుకొని అభివృదిలో ముందుకు పోతున్నామని అన్నారు.గడిచిన 10 ఏండ్ల కాలంలో రాష్ట్రానికి చేసింది ఏమి లేదని కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ఉచిత బస్సు.ఉచిత విద్యుత్.500లకే గ్యాస్.రైతు రుణమాఫీ వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు దగ్గర ఉంటూ నూతన రేషన్ కార్డ్స్ ఉద్యోగాలు.హైడ్రా పేరుతో చెరువులు కుంటలను కబ్జాకోరులనుండి కాపాడుకుంటూ ప్రభుత్వ భూములను కొన్ని వందల ఎకరాలను కాపాడి నేడు రాష్ట్రం లోనే హైడ్రా అంటే కబ్జాదారుల గుండెల్లో భయం పుటిస్తున సంస్థ అని అన్నారు.మరో రెండు సంవత్సరాల పాలనలో మరింత ముందుకు దూసుకుపోతామని రానున్నఏ ఎన్నికలు వచ్చిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వమే కావాలని కోరుకుంటున్నారని కల్లబొల్లు మాటలు చెప్పుకుంటూ ప్రజలను మబ్బిపెడుతూ ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నాలు చేసే ప్రజా బుద్ధి చెప్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు డప్పు నరేందర్. నాగరాజు యాదవ్.ప్రసాద్.ఐలేష్.శివాజీ.

# ఇశ్రీతాబాద్ సాయిబా మందిర 9వ వార్షికోత్సవం

- మందిరం అధ్యక్షులు కోడూరు లక్ష్మీ రాములు.



**సదాశివపేట.సెప్టెంబర్ 5. (సిరిన్యూస్)**

సదాశివపేట మండలం ఇశితాబాద్ గ్రామంలోని సాయిబాబా మందిర ఆలయ అధ్యక్షుని కోడూరు లక్ష్మి రాములు ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శనివారం నాడు ఉదయం పల్లకి సేవ, మధ్యాహ్నం హారతి, అనంతరం గత 8 సంవత్సరాలుగా వార్షికోత్సవం నాడు పెద్ద నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇశితాబాద్ సర్పంచ్ బలరాం అనిత శ్రీనివాస్, ఆలయ పంతులు మంజునాథ్, జి.రాములు, రామతీర్థం, బి. రాములు, నర్సింలు, పాండు, కంది మల్లేశం, కోడూరు కృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ పోరాటానికి ఫలితం..

- ఈఎస్ఐ మందులు తిరిగి!
- ఆరు నెలల కృషితో కదిలిన యంత్రాంగం..
- సూపర్ స్పెషాలిటీ మందులకు ఆదేశాలు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):**

రామచంద్రపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో ఏళ్లుగా నిలిచిపోయిన సూపర్ స్పెషాలిటీ మందుల సరఫరా మళ్లీ అందుబాటులోకి రానుంది. ఈ సమస్యపై సీఐటీయూ ఆరు నెలలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈఎస్ఐ యంత్రాంగం స్పందించింది. రామచంద్రపురం ఆసుపత్రిలోనే మందులు అందుబాటులో ఉంచాలని అధికారిక ఆదేశాలు జారీ చేసింది. క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఈఎస్ఐ రోగులకు ఇకపై అవసరమైన మందులు స్థానికంగానే లభించనున్నాయి. గతంలో ఇతర ప్రాంతాలకు తరలించిన సరఫరాను తిరిగి ఇక్కడే ఏర్పాటు చేయడంతో వేలాది మంది రోగులకు ఉపశమనం కలగనుంది. ఈ మేరకు జాయింట్ డైరెక్టర్ కాంతి సాగర్ అధికారిక ఉత్తర్వుల ప్రతిని సీఐటీయూ నాయకత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ, ఈఎస్ఐకి చందాలు చెల్లిస్తున్న కార్మికులకు నాణ్యమైన వైద్యం, అవసరమైన మందులు అందించడం యంత్రాంగం బాధ్యత అన్నారు. సంవత్సరాలుగా సరఫరా లేక రోగులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ నిరంతరం అధికారులను కోరిందని తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకుడు వాజిద్దలి మాట్లాడుతూ, ఈ నిర్ణయం ఈఎస్ఐ రోగుల హక్కుల కోసం చేసిన కృషికి లభించిన విజయమన్నారు. ఆసుపత్రుల్లో సర్జికల్ ఐటమ్స్, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత వంటి సమస్యల పరిష్కారం కోసం కూడా భవిష్యత్తులో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి, జిల్లా నాయకుడు వాజిద్దలి, మాజీ ఈఎస్ఐ బోర్డు సభ్యుడు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసిన బాగీలేకర్ భగవాన్.



**సదాశివపేట. సెప్టెంబర్ 5. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో గల శ్రీ పంచముఖ హనుమాన్ మందిరంలో శ్రావణమాసం సందర్భంగా శనివారం భగలేకర్ భగవాన్ కుటుంబ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి నాడు ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తారు. అన్నప్రసాద కార్యక్రమానికి అవసరమయ్యే 100 స్టీల్ ప్లేట్లు, గ్లాసులు భగవాన్ ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా బగిలేకర్ భగవాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ ప్లేట్లు గ్లాసులను నిషేధించాలన్నారు. మంచి భవిష్యత్తు కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ నాగుల మానెమ్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మంబిగారి ఆంజనేయులు భగవాన్ కుటుంబ సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు సగ్గం రాములు, నాగుల విజయ్ కుమార్, గురుగుల నాగరాజు, బోయిని జగదీశ్వర్, చంద్రకాంత్, బోయిని రాము తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలం

- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా ఎగబెట్టేందుకు కాంగ్రెస్ కుట్ర
- వృద్ధులు, వికలాంగులు, మహిళల పెన్షన్ల పెంపులో ప్రభుత్వం ఘోర విఫలం!
- రూ. 4,000 పింఛన్ హామీ ఏమైంది?..
- మెదక్ మహిళా సదస్సులో మాజీ ఎమ్మెల్సీ షేరీ సుభాష్ రెడ్డి

**రామాయంపేట, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్)**

ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక రకాల ఆకర్షణీయమైన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమై ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలన వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ శనివారం నాడు మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శన, మహిళా సదస్సు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆసరాగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా ఎగబెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఉన్న పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయకుండా నిలిపివేసి పేదల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. నెలల తరబడి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు పెండింగ్‌లో పెడుతూ పేదింటి కుటుంబాలకు సహాయం అందకుండా ఎగబెట్టే ధోరణిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు.

**వృద్ధులు, వికలాంగులు, మహిళల పింఛన్ల పెంపులో విఫలం**

ఎన్నికల వేళ పింఛన్ల మొత్తాన్ని రూ. 2,000ల నుండి రూ. 4,000లకు పెంచుతామని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని నీరుగార్చారని మండిపడ్డారు. పెరిగిన పింఛన్ అందుతుందని ఆశగా ఎదురుచూస్తున్న వికలాంగులు,



వృద్ధులు, ఆసరా లబ్ధిదారులను మోసం చేశారన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి ఇప్పటివరకు రూపాయి కూడా విదల్చకుండా మహిళలను వంచించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రూ. 2 లక్షల రుణమాఫీని సక్రమంగా అమలు చేయకుండా అనేక మంది అర్హులైన రైతులను పక్కనబెట్టారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు వేళకు అందే రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏ ఏ పథకాల కింద ఎంతెంత బాకీ ఉందో లెక్కలతో వివరించే 'బాకీ కార్డులను' మహిళలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనతో విసిగిపోయిన ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపే చూస్తున్నారని సుభాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఎల్లయ్య స్మృతులకు ఘన నివాళి..



- వర్ధంతిలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి
- విగ్రహానికి పూలమాల వేసి నివాళులు.. కుటుంబ సభ్యులకు పరామర్శ

**రామచంద్రపురం, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):**

తెల్లాపూర్‌లోని జి.వై. ఎన్‌క్లేవ్‌లో దివంగత ఎల్లయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి హాజరై ఎల్లయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య కుటుంబ సభ్యులను ఆదర్శ్‌రెడ్డి పరామర్శించి, వారికి తన సానుభూతిని తెలియజేశారు. ఎల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథరెడ్డి, పరమేష్‌యాదవ్, భాస్కర్ ముదిరాజ్, తారాసింగ్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం







- ఉపాధ్యాయులను సన్మానించిన పోలీసులు..
- విద్యార్థులకు భద్రతపై అవగాహన

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పోలీసులు శనివారం పటాన్‌చెరు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ రవీందర్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వీరమణితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఉపాధ్యాయులను సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మమేకమై మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, మహిళలు-బాలల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, డిజిటల్ వేదికలను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఎలాంటి బెదిరింపులు, వేధింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ విద్యపై దృష్టి సారించి, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పోలీసులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

# ఒక్కక్షణం కుటుంబంలో ఆరని శోకం

- వేగంగా వచ్చి ప్రాణం తీసిన కంకర టిప్పర్
- వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు

**జిన్నారం సెప్టెంబర్ 05 సిరి న్యూస్**



బైక్ పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వేగంగా వచ్చిన కంకర టిప్పర్ (లారీ) బలంగా ఢీ కొట్టింది. ఢీ కొట్టిన దాటికి బైకు తీవ్రంగా ధ్వంసమై, మోటార్ వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని కాజిపల్లి కంకర క్రషర్లల్లో శనివారం టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడని స్థానికుల సమాచారం ప్రకారం ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాం అని తెలిపారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి





**వెల్దుర్తి, సెప్టెంబర్ 05, (సిరి న్యూస్):**

పొలం పనులకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన వెల్దుర్తి మండలంలోని మానేపల్లి గ్రామం లో శనివారం చోటుచేసుకుంది. మానేపల్లి గ్రామానికి చెందిన రిక్కం శ్రీకాంత్ (30) తన కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం సుమారు 6 గంటల సమయంలో వ్యవసాయ పొలానికి వరి పొలం పనుల నిమిత్తం వెళ్లాడు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో పొలానికి నీరు పెట్టేందుకు మోటారు ఆన్ చేయడానికి వెళ్లిన శ్రీకాంత్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు మృతుని భార్య అనుష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం కు తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది అని ఎస్సై కరుణాకర్ తెలిపారు.

# గురువే సమాజానికి మార్గదర్శి..!





- పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే.
- విద్యారంగంలో పెను మార్పులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి.
- ఉపాధ్యాయులందరికి గురు పూజోత్సవ శుభాకాంక్షలు.
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**మెదక్ సెప్టెంబర్,05(సిరి న్యూస్)**

సమాజానికి దిక్సూచి 'ఉపాధ్యాయుడు' అని పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ,పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు గురుతర భాధ్యతను నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఉపాధ్యాయులను కొనియాడారు. శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో గురు పూజోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జిల్లా గ్రంధాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి ,మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఏ.డి శ్రీనివాసరావు ,సీఎంఓ రాజు ,ఏ ఎం ఓ సుదర్శనమూర్తి, ఏ.ఎస్.ఓ నవీన్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన, గావించి డా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు గురు పూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ 138 గురుపూజోత్సవ వేడుకలు సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదేనని, గురువుకు మించిన దైవం ఈ లోకంలో లేదని పేర్కొన్నారు. విద్యా బోధనలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, భవిష్యత్తును ఇచ్చేది గురువేనని పేర్కొన్నారు. పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులు గురుతర భాధ్యతను నిర్వహిస్తున్నారని ఆమె అన్నారు. పాఠశాలల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని, విద్యకు ప్రథమ ప్రాధాన్యతనివ్వడమేనని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సమాంతరంగా కృషి చేస్తున్నామని, తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులని అన్నారు. విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను గుర్తించి, సత్కరించడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళే దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. జిల్లాలోని ప్రతిభావంతమైన ఉపాధ్యాయుల సేవలను ప్రశంసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని అభినందించారు. ఉపాధ్యాయుల మోటివేషన్ వల్లే తాను సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధం అయ్యానని. తన ఉన్నతికి దోహదపడిందని కాబట్టే తాను ఐ.ఏ.ఎస్ కాగలిగాను అని ఉపాధ్యాయులు కృషిని అభినందిస్తూ, ఇదే కృషితో మన జిల్లా ఉత్తమ ఫలితాలతో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చి లుమల సుహాసిని రెడ్డి,మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు తదితరులు ప్రసంగించారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను కొనియాడుతూ పిల్లల భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈఓ రాజు, వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఎసి సెక్రెటరీ ఆర్. సిరి సౌజన్య.

**మెదక్ సెప్టెంబర్,05(సిరి న్యూస్)**



ఈ నెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎఫ్ఎసి సెక్రెటరీ ఆర్.సిరి సౌజన్య. తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.న్యాయస్థానాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకునే కంటే.. పరస్పర అంగీకారంతో సమస్యలను ముగించుకునే రాజీ మార్గమే కక్షిదారులకు నిజమైన రాజమార్గం అన్నారు. ప్రజలకు త్వరితగతిన, అత్యంత సులభంగా, తక్కువ ఖర్చుతో చట్టబద్ధమైన న్యాయం అందించడమే లక్ష్యంగా ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు,కక్షిదారులు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ జాతీయ లోక్ అదాలత్లో పెండింగ్లో ఉన్న సివిల్ కేసులు, భూసేకరణ కేసులు మున్సిపల్ ఇన్సూరెన్స్, బ్యాంకు కేసులను ఎటువంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు.

# ఫ్లెమింగ్ కంపెనీ సేవలు అభినందనీయం .....

**శివంపేట్ సెప్టెంబర్ 5 (సిరి న్యూస్ )**

శివంపేట మండలం పెద్దగొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కి సుమారు 4,00,00,0/లక్షల రూపాయల విలువ గల 60 డెస్క్ బెంచ్ లను అందచేసిన ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యం కంపెనీ చీఫ్ ఆపరేటర్ ఆఫీసర్ రామ్ కుమార్,హెచ్ ఆర్ రాజేందర్ వచ్చి సర్పంచ్ యం. నవీన్ గారితో కలసి స్కూల్ యాజమాన్యంనికి బెంచ్ లను అప్పజెప్పటం జరిగింది ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ అల్లాడి ఆంజనేయులు,స్కూల్ హెడ్మాస్టర్ సురేష్, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ మానస,వార్డు సభ్యులు అల్లాడి వీరేశం బేరి సాయికుమార్,కాళ్ళ హరీష్, నాయకులు మురళీ మనోహర్ రెడ్డి, వీరా రెడ్డి,ప్రభాకర్ గౌడ్ పోచయ్య, ఛత్రి గణేష్, మునుగొండ నాగేష్ మునుగొండ రాము కమిలి నగేష్,అనిల్ రెడ్డి,మంగలి ఆంజనేయులు జంగం బిక్షపతి చింతల భాస్కర్ పుట్ట లక్ష్మినారాయణ, అజయ్ పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ స్కూల్ ఉపాధ్యాయులు గ్రామ యువకులు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



## కీర్తిశేషులు స్వర్గీయ పెద్దగోని ప్రసాద్ గౌడ్ 57వ జయంతి నివాళులు!!



**శివంపేట్ సెప్టెంబర్ 5 (సిరి న్యూస్)**

కీర్తిశేషులు స్వర్గీయ శ్రీ పెద్దగోని ప్రసాద్ 57వ జయంతి సందర్భంగా గూడూరు గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలు వేసి మండల పార్టీ అధ్యక్షులు వై రమణ గౌడ్ ఘనంగా నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా రమణ గౌడ్ మాట్లాడుతూ ప్రసాద్ చేసిన సేవలు ప్రజల గుండెల్లో ఎప్పుడు నిలిచిపోతాయని అన్నారు ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా హైకోర్టు న్యాయవాది పెద్దగోని శివకుమార్ గౌడ్ ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్, అశోక్ ఎడ్యుకేషనల్ సోసైటీ నెలకొల్పి శివంపేట మండల ప్రజలకు గత 22 సంవత్సరాలుగా సేవ చేస్తున్నాడు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ బ్యాగర్ నర్సయ్య, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్,మురళి, నాగభూషణం, మాజీ ఉపసర్పంచ్ చరణ్ సత్తయ్య మౌజం బ్యాగరి సాయిలు బ్యాగరి యాదగిరి గూడెపు రాజుకాజా వార్డు సభ్యులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యం




- **మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా.**

**రామాయంపేట, సెప్టెంబర్ 5( సిరి న్యూస్)**

పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్న రామాయంపేట పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు గుప్తా తెలిపారు.
మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుట్టు మిషన్, మగ్గం వర్క్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఎస్‌బీఐ బ్యాంకు సహకారంతో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు జూట్ బ్యాగుల తయారీ, మగ్గం, కుట్టు మిషన్ తదితర అంశాల్లో 40 రోజులపాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి, స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. మహిళలు తలుచుకుంటే ఏ రంగంలోనైనా రాణించగలరని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని చైర్‌పర్సన్ లావణ్య నాగరాజు గుప్తా సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత, కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్తా, దేవుని రంజిత్, పుట్టి సందీప్, బైరం స్వప్న, ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, రెండవ వార్డ్ కౌన్సిలర్ కొక్కు ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఫ్లెమింగ్ కంపెనీ సేవలు అభినందనీయం.....



**శివంపేట్ సెప్టెంబర్ 5 (సిరి న్యూస్ )**

శివంపేట మండలం పెద్దగొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కి సుమారు 4,00,00,0/లక్షల రూపాయల విలువ గల 60 డెస్క్ బెంచ్ లను అందచేసిన ఫ్లెమింగ్ కంపెనీ యాజమాన్యం కంపెనీ చీఫ్ ఆపరేటర్ ఆఫీసర్ రామ్ కుమార్,హెచ్ ఆర్ రాజేందర్ వచ్చిసర్పంచ్ యం.నవీన్‌గారితో కలసి స్కూల్ యాజమాన్యంనికి బెంచ్ లను అప్పజెప్పటం జరిగింది ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ అల్లాడి ఆంజనేయులు,స్కూల్ హెడ్మాస్టర్ సురేష్,ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ మానస,వార్డు సభ్యులు అల్లాడి వీరేశం బేరి సాయికుమార్,కాళ్ళ హరీష్, నాయకులు మురళీ మనోహర్ రెడ్డి,వీరా రెడ్డి,ప్రభాకర్ గౌడ్ పోచయ్య, ఛత్రి గణేష్, మునుగొండ నాగేష్ మునుగొండ రాము కమిలి నగేష్,అనిల్ రెడ్డి,మంగలి ఆంజనేయులు జంగం బిక్షపతి చింతల భాస్కర్ పుట్ట లక్ష్మినారాయణ, అజయ్ పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్ స్కూల్ ఉపాధ్యాయులు గ్రామ యువకులు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా పుష్ప యాగం

- **ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్ పర్సన్**
- **గజవాడ లావణ్య నాగరాజు గుప్తా.**

**రామాయంపేట, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్)**





రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో గల శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నాలుగో శ్రావణం శనివారం నాడు స్వామి వారికి కన్నుల పండుగగా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా పలు రకాల పుష్పాలను భక్తితో స్వామివారికి సమర్పించడం జరిగింది. పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, మరియు పాడి పంటలు పుష్కలంగా పండాలని స్వామి వారిని వేడుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్వై స్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్ బైరం స్వప్న కుమార్, కో ఆప్షన్ సభ్యురాలు చింతల రాధా భవాని యాదగిరి తో పాటు దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రైతుల భూములపై 22ఏ నిషేధం ఎత్తివేయాలి





- **రెవెన్యూ మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి**
- **రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు**
- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్ ):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, రైతన్న కంట కన్నీరు కాంగ్రెస్ పాలనకు నిదర్శనమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో కార్యక్రమంలో భాగంగా శనివారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన రైతన్న పోరుబాట కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ వంటి పథకాలతో గ్రామీణ, వ్యవసాయ రంగాలకు అండగా నిలిచారని అన్నారు. ప్రస్తుతం జిన్నారం, గుమ్మడిదల తదితర ప్రాంతాల్లో రైతుల వ్యవసాయ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రైతుల భూములపై 22ఏ నిషేధాన్ని తక్షణమే ఎత్తివేయాలని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రిని పదవి నుంచి తప్పించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సఫన్ దేవ్, మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు కోలన్ బాల్ రెడ్డి, జిన్నారం వెంకటేశం గౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# దోమడుగులో గరుడా కబడ్డీ సందడి

- **20 జట్లతో పోటీలు ప్రారంభం**
- **అండర్-19 బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్‌కు శ్రీకారం**

**గుమ్మడిదల సెప్టెంబర్ 5 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు గ్రామంలో గరుడా కబడ్డీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అండర్ 19 విభాగంలో బాలురతో పాటు బాలికల జట్లు కూడా ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. మొత్తం 20 జట్లు టోర్నమెంట్‌లో తలపడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడకు ప్రోత్సాహం అందించడంతో పాటు యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్ 19 బాలుర, బాలికల జట్లు ఉత్సాహంగా పాల్గొంటుండటంతో దోమడుగు గ్రామంలో క్రీడా సందడి నెలకొంది. ఈ టోర్నమెంట్‌కు అశోక్, లై, సాయినాథ్ రెడ్డి, అభిషేక్, లతీఫ్ ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. క్రీడాకారులను అభినందించిన కుమార్ గౌడ్గ రుడా కబడ్డీ టోర్నమెంట్‌ను గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ గ్రామ వార్డు కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను తిలకించి క్రీడాకారులతో మాట్లాడి వారిని అభినందించారు. క్రీడాకారుల ప్రతిభను ప్రశంసిస్తూ పోటీల్లో మరింత ఉత్సాహంతో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, భవిష్యత్‌లోనూ ఇలాంటి క్రీడా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అభి శెట్టి రాజశేఖర్, సురభి కుమార్ గౌడ్, శ్రీ చూర్ణం చక్రపాణి, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు శేఖర్ రెడ్డి, కృష్ణ, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్‌యస్ కు లేదు

- **మాసాయిపేట్ మండల కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక**

**వెల్దుర్తి,సెప్టెంబర్ 05,(సిరి న్యూస్):**



మాసాయిపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజున జరిగిన బి ఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి పై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మాసాయిపేట మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం మాసాయిపేట్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు వీరన్నగారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లలో మాసాయిపేట ప్రాంతం అభివృద్ధికి పూర్తిగా నోచుకోలేదని విమర్శించారు. మాసాయిపేట మండలంలోని హకీంపేట, నాగ్సన్‌పల్లి, గ్రామాల రోడ్లను గత పాలకులు ఎందుకు పట్టించుకోలేదో చంద్రగౌడ్, బి ఆర్ యస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక చొరవతో హకీంపేట, నాగ్సన్‌పల్లి రోడ్లకు నిధులు మంజూరయ్యాయని, హకీంపేట రోడ్డు పనులు పూర్తి చేశామని తెలిపారు. నాగ్సన్‌పల్లి రోడ్డు పనులను కూడా అతి త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మాసాయిపేట మండలం అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్‌కు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గత పదేళ్లలో మాసాయిపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాల్సింది పోయి, పదేళ్లు వెనక్కి నెట్టిన నాయకులు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మాసాయిపేట గ్రామ అభివృద్ధికి నిధులు సమకూర్చడంతో పాటు 49 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఆవుల రాజిరెడ్డి , ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ మాసాయిపేట ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంటున్నారని అన్నారు. ఈ ప్రజాదరణను చూసి అసూయ, ఆవేదనతోనే చంద్రగౌడ్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. అదేవిధంగా చంద్రగౌడ్‌పై కూడా
ప్రజల్లో పలు ఆరోపణలు, చర్చలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు అందాల్సిన పరిహారం విషయంలో, అలాగే కుటుంబ వివాదాల్లో మధ్యవర్తిత్వం పేరుతో డబ్బుల వ్యవహారాలకు సంబంధించి తనపై వస్తున్న ఆరోపణలపై చంద్రగౌడ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతరులపై ఆరోపణలు చేయడం ఎంత సులభమో, తనపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం కూడా అంతే బాధ్యత అని అన్నారు. సొంత నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆవుల రాజిరెడ్డి పై వ్యక్తిగత దూషణలకు దిగితే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు. ఇకనైనా చంద్రగౌడ్ వ్యక్తిగత విమర్శలు, నిరాధార ఆరోపణలకు స్వస్తి పలకాలని, లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయంగా దీటైన సమాధానం ఇవ్వడంతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మాసాయిపేట మండల కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మసాయి పేట్ సర్పంచ్ కృష్ణారెడ్డి, సిద్ధిరాములు గౌడ్, గోపి నాయక్,మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తిని అవమానిస్తే సహించేది లేదు

- కాంగ్రెస్ ఎమ్మెల్యేకు సిగ్గుండాలి..
- బాధ్యతాయుత పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలా?
- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు

**రామాయంపేట, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్)**



సమాజానికి జ్ఞానాన్ని అందిస్తూ భావిత రాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిని కించపరిచేలా కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపాటి సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే ఓ ప్రజాప్రతినిధి ఉపాధ్యాయ ఉద్యోగం గురించి అవమానకరంగా మాట్లాడటం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉపాధ్యాయ వృత్తి ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవించబడే పవిత్రమైన వృత్తి అని, అలాంటి వృత్తిని అవమానించే ముందు కనీసం మాట్లాడే పద్ధతి, బాధ్యత, ఇంగిత జ్ఞానం ఉండాలని రాగి రాములు ఘాటుగా వ్యాఖ్యానించారు. "వ్యక్తులను విమర్శించండి.. రాజకీయ నాయకులను విమర్శించండి.. కానీ లక్షలాది మంది ఉపాధ్యాయుల గౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదు" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులకు నోరు అదుపులో పెట్టుకోవడం తెలియడం లేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఏది పడితే అది మాట్లాడటం సరికాదని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగులు కాదని, సమాజానికి దిశానిర్దేశం చేసే గురువులు, భావితరాలకు పునాది వేసే శిల్పులని పేర్కొన్నారు. అలాంటి వృత్తిని అవమానించే వ్యాఖ్యలు చేయడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉపాధ్యాయ సమాజాన్ని అవమానించారని ఆరోపించారు. "మీకు సిగ్గుండాలి.. కనీసం మాట్లాడేటప్పుడు పద్ధతి ఉండాలి. ఉపాధ్యాయుల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసే ముందు మీరు ఏ స్థాయిలో ఉన్నారో గుర్తు పెట్టుకోవాలి" అంటూ రాగి రాములు తీవ్రంగా స్పందించారు. రాజకీయ విమర్శలకు ఒక హద్దు ఉంటుందని, ఆ హద్దు దాటి ఒక వృత్తి మొత్తాన్ని అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉపాధ్యాయ సమాజానికి కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపాటి సత్యనారాయణ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాగి రాములు డిమాండ్ చేశారు. ఇకపై ఏ వృత్తినీ కించపరిచేలా వ్యాఖ్యలు చేయకుండా, ప్రజాప్రతినిధిగా తన స్థాయికి తగ్గట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# ఘనంగా అన్నదాన కార్యక్రమం





- మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి అన్నదాన కార్యక్రమం ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.

**సెప్టెంబర్ 05 కొల్చారం (సిరి న్యూస్)**

శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామంలోని దాతలు తమకు తోచిన విధంగా విరాళాలు అందించారు. ఒకరు బియ్యం, మరొకరు పూజా సామగ్రి, ఇంకొకరు కూరగాయలు, మరొకరు ప్లేట్లు, ఇలా ప్రతి ఇంటి నుంచి తమవంతు సహకారం అందిస్తూ అన్నదాన కార్యక్రమానికి అండగా నిలిచారు. 'ఒక్కరి కోసం అందరూ.. అందరి కోసం ఒక్కరు' అనే స్ఫూర్తితో గ్రామ ప్రజలంతా ఐక్యంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు స్వామివారిని ప్రార్థించారు. గ్రామ ప్రజల ఐక్యతకు, భక్తి భావానికి ప్రతీకగా నిలిచిన ఈ అన్నదాన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు, గ్రామంలోని ఐక్యతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మోదీ 'జెన్-జీ' మాటలతో సందడి

- ఎస్ఆర్‌సీసీ శతాబ్ది వేడుకల ముగింపు సభలో ప్రధాని ప్రసంగం
- 'OG', 'ఫ్లెక్స్' అంటూ విద్యార్థుల్లో ఉత్సాహం
- 2013 నాటి 'సగం నిండిన గ్లాస్' ప్రసంగం గుర్తుచేసుకున్న మోదీ
- ప్రపంచ స్థాయి సంస్థలుగా భారత కంపెనీలు ఎదగాలని పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:**



ఢిల్లీలోని ప్రముఖ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది వేడుకల ముగింపు సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. నేటి యువత, ముఖ్యంగా జెన్‌జీకి పరిచయమైన పదాలను ఉపయోగిస్తూ విద్యార్థులతో మమేకమయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థుల విజయాలను ప్రస్తావిస్తూ.. జెన్‌జీ భాషలో చెప్పాలంటే ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) అంటూ చమత్కరించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 'నేను ఎస్ఆర్‌సీసీ విద్యార్థిని' అని చెప్పుకోవడమే ఒక పెద్ద 'ఫ్లెక్స్' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అరుణ్ జైట్లీ, సంజీవ్ సన్యాల్ వంటి ప్రముఖులతో కలిసి పని చేసిన అనుభవాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

**సగం నిండిన గ్లాస్ సిద్ధాంతం**

2013లో ఎస్ఆర్‌సీసీని సందర్శించిన సందర్భంగా చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. గ్లాసులో సగం నీళ్లు ఉన్నప్పుడు దాన్ని సగం ఖాళీగా చూడటం కంటే సగం నిండినట్లు చూడటమే సానుకూల దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే విధంగా భారత్‌లోని అవకాశాలను సానుకూల దృష్టితో చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోని అగ్రగామి బహుళజాతి సంస్థలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని, అలాంటప్పుడు భారత కంపెనీలే ప్రపంచ స్థాయి సంస్థలుగా ఎందుకు ఎదగకూడదని విద్యార్థులను ప్రశ్నించారు.

**ఎన్ఈపీ అమలుపై ప్రశంసలు**

కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎస్ఆర్‌సీసీ జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను సమర్థవంతంగా అమలు చేస్తోందని ప్రశంసించారు. గత పదేళ్లలో దేశంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 4.54 కోట్లకు చేరిందని తెలిపారు. భారత్‌లో 2.3 లక్షల గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఉండగా.. దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఎదిగిందని వివరించారు.

# యూస్‌మార్గ్‌లో లష్కరే కమాండర్ హతం

- భద్రతా బలగాల సంయుక్త ఆపరేషన్
- ఎదురుకాల్పుల్లో యాసిర్ మృతి
- 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ గాలింపు
- స్థానిక నెట్‌వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం
- సులైమాన్ మూసా గ్రూప్‌తో గతంలో సంబంధాలు

**బద్గామ్, సెప్టెంబర్ 5:**



జమ్మూకశ్మీర్‌లోని బద్గామ్ జిల్లా యూస్‌మార్గ్ ఎగువ ప్రాంతాల్లో భద్రతా బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో లష్కరే తొయిబా కమాండర్ యాసిర్ హతమయ్యాడు. ఉగ్రవాదుల కదలికలపై అందిన కచ్చితమైన నిఘా సమాచారంతో ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు శుక్రవారం రాత్రి గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు జరగడంతో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

**ఒంటరిగానే కార్యకలాపాలు**

భద్రతా సంస్థల వివరాల ప్రకారం.. యాసిర్ గతంలో లష్కరే తొయిబాకు చెందిన సులైమాన్ మూసా గ్రూప్‌లో కీలక సభ్యుడిగా పనిచేశాడు. ఏడాది క్రితం ఆ ముఠా నుంచి విడిపోయిన తర్వాత సొంతంగా ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. యూస్‌మార్గ్ పరిసరాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచిన బలగాలు పక్కా ప్రణాళికతో ఆపరేషన్ నిర్వహించి మట్టుబెట్టాయి.

**నెట్‌వర్క్‌పై ఆరా**

యాసిర్ హతంతో యూస్‌మార్గ్ ప్రాంతంలో లష్కరే తొయిబా నెట్‌వర్క్‌కు గట్టి దెబ్బ తగిలిందని అధికారులు తెలిపారు. అతడితో సంబంధాలు ఉన్న ఇతర ఉగ్రవాదులు, స్థానికంగా సహకరిస్తున్న వ్యక్తులు, ఇటీవల జరిగిన ఉగ్ర ఘటనల్లో అతడి పాత్రపై భద్రతా బలగాలు, దర్యాప్తు సంస్థలు విచారణ కొనసాగిస్తున్నాయి.

**ఎవరీ సులైమాన్ మూసా?**

హాషిమ్ మూసా పేరుతోనూ సులైమాన్ మూసా వ్యవహరించేవాడు. 2025లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రధాన సూత్రధారుల్లో అతడొకడిగా భద్రతా సంస్థలు గుర్తించాయి. అనంతరం శ్రీనగర్‌లోని దాచిగామ్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన ప్రత్యేక ఎన్‌కౌంటర్‌లో మూసా హతమైనట్లు అధికారులు వెల్లడించారు.

## ఆత్మ గౌరవ భవనాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



- రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా

**రామాయంపేట, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్)**

కుల సంఘాల అభివృద్ధితో పాటు ఆత్మ గౌరవ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా అన్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు మున్నూరు కాపు సంఘం బేడ-2లో నూతన బోరుబావి తవ్వక పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు గుప్తా మాట్లాడుతూ.. రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. సుమారు రూ.50 లక్షలతో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బోరుబావి అందుబాటులోకి రావడంతో స్థానికులకు నీటి సమస్య కొంతమేర పరిష్కారం కానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు దేవుని రంజిత్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచమ్మల గణేష్, చింతల స్వామి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం, చింతల యాదగిరి, విప్లవ్ కుమార్, తొంటవాలి యాదగిరి, జలగడుగుల గంగారం, తౌనిగండ్ల శంకరయ్య, మున్నూరు కాపు సంఘం నాయకులు చింతల రాములు, బాదే రామరాజు, తదితరులు పాల్గొన్నారు.



## భార్యపై అనుమానం.. చివరకు హత్య!..



- భార్య సబితను హతమార్చిన
- భర్త మల్లేష్..
- వై-జంక్షన్ వద్ద నిందితుడి అరెస్ట్..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 05 (సిరి న్యూస్)**

భార్యపై అనుమానం పెంచుకున్న భర్త వేధింపులకు పాల్పడి, చివరకు ఆమెను హత్య చేసిన ఘటన నెన్నెలలో కలకలం రేపింది. ఈ కేసులో నిందితుడు తోట మల్లేష్‌ను నెన్నెల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నెన్నెల గ్రామానికి చెందిన తోట సబిత (38) నిందితుడి భార్య. కొంతకాలంగా భార్యపై అనుమానంతో మల్లేష్ తరచూ ఆమెతో గొడవపడుతూ, వేధించేవాడని, గతంలోనూ హత్యాయత్నానికి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సెప్టెంబర్ 2న మధ్యాహ్నం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో మల్లేష్ సబిత గొంతు నులిమి, ఇంట్లో లభించిన పదునైన వస్తువుతో గొంతుపై దాడి చేసి హత్య చేసినట్లు బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. హనూక్ తెలిపారు. అనంతరం రక్తపు మరకలున్న దుస్తులను ఇంట్లోనే వదిలి, దుస్తులు మార్చుకుని పరారయ్యాడు. నిందితుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు సెప్టెంబర్ 4 సాయంత్రం అందిన విశ్వసనీయ సమాచారంతో తాళ్లగురజాల వైజంక్షన్ వద్ద మల్లేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించింది. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ సి.హెచ్. హనూక్ అభినందించారు..

## నేపాల్‌లో మరో అద్భుతం

**ఖాట్మండు, సెప్టెంబర్ 5:**

తీవ్ర ప్రళయంతో అతలాకుతలమైన నేపాల్‌లో శనివారం మరో అద్భుత ఘటన చోటుచేసుకుంది. వరద బురద, కాంక్రీట్ శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులను దాదాపు 10 రోజుల తర్వాత సహాయక బృందాలు సజీవంగా వెలికితీశాయి. దీంతో గత రెండు రోజుల్లో ప్రాణాలతో బయటపడిన వారి సంఖ్య నాలుగుకు చేరింది.

**టన్నెల్‌లో చైనా కార్మికుడి రక్షణ**

త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు కింద ఉన్న 225 మీటర్ల పొడవైన సొరంగంలో చిక్కుకున్న చైనా కార్మికుడు లు హైతావోను నేపాల్ ఆర్మీ, దక్షిణ కొరియా విపత్తు నిర్వహణ బృందాలు సంయుక్తంగా రక్షించాయి. బురదతో పూర్తిగా కప్పబడి ఉన్న అతడిని బయటకు తీసిన వెంటనే హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించారు.



## జీడిపప్పులు ఎక్కువగా
# లాగించేస్తున్నారా..

**ఈ ప్రమాదం పొంచి ఉన్నట్టే..**

ఇటీవల ఆరోగ్యం మీద ప్రజలకు విపరీతమైన ద్యాస పెరిగిపోయింది. ఇక ఆరోగ్యం కోసమంటూ కొందరు జీడిపప్పులు తెగ లాగించేస్తున్నారు. అయితే జీడిపప్పుతో ఆరోగ్యంతో పాటు కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయంటున్నారు ఆరోగ్య నిపుణులు ముఖ్యంగా గ్యాస్ట్రిక్, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు వచ్చి ఇబ్బంది పెడతాయి. ఈ విషయాన్ని మేము చెప్పడం లేదు ఎన్నో అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. జీడిపప్పులు నట్స్ జాబితాలోకి వస్తాయి. ఈ జీడిపప్పుల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు నిండి ఉంటాయి. జీడిపప్పుల్లో మోనోశాచురేటెడ్ కొవ్వు ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. వీటిలో మెగ్నీషియం, జింక్, ఐరన్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. జీడిపప్పులో సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, ఫైబర్ కూడా ఉంటాయి. ఇది కొంతమందిలో జీర్ణక్రియకు సమస్యగా మారుతుంది. అందుకే జీడిపప్పులను తిన్నా కూడా చాలా మితంగా తినాలి. అధికంగా తింటే గ్యాస్ట్రిక్, పొట్ట ఉబ్బరానికి దారి తీసే అవకాశం ఉంది. జీడిపప్పుల్లో డైటరీ ఫైబర్ తక్కువగా ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని కాపాడడానికి, పేగు కదలికలను చురుగ్గా ఉండేలా చూసుకోవడానికి పీచు పదార్థం అవసరం. ఎప్పుడైతే పీచు పదార్థం తక్కువగా ఉండడం వల్ల జీడిపప్పులు సరిగా జీర్ణం కావు. అవి పొట్ట ఉబ్బరానికి, గ్యాస్ ఏర్పడడానికి కారణం అవుతాయి. జీడిపప్పులు ఫైటేట్లు ఉంటాయి. ఇవి ఆహారంలో లభించే సహజ సమ్మేళనాలు. ఫైటేట్లు యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. అయితే వీటి వల్ల కలిగే ప్రయోజనాలు మాత్రం తక్కువే. ఈ ఫైటేట్ సమ్మేళనాలు శరీరంలో పెరిగితే జీర్ణక్రియకు ఆటంకం కలుగుతుంది. జీర్ణ ప్రక్రియ ఆలస్యం అవుతుంది. దీనివల్ల పొట్టలో గ్యాస్ ఉత్పత్తి పెరిగిపోతుంది. జీడిపప్పును జీర్ణం చేయడానికి మన జీర్ణవ్యవస్థ ఎంతో కష్టపడుతుంది. అందుకే వాటిని తక్కువగా తింటే మంచిది. కొంతమందికి జీడిపప్పు వల్ల అలెర్జీలు కూడా కలిగే అవకాశం ఉంది. అలర్జీలు కూడా కడుపు ఉబ్బరం, గ్యాస్ ఉత్పత్తి కావడం వంటి లక్షణాలతోనే కనిపిస్తుంది. మీకు జీడిపప్పు తిన్న వెంటనే పొట్టలో ఏదైనా ఇబ్బందిగా అనిపిస్తున్నా... పొట్ట ఉబ్బరంగా అనిపిస్తున్న వాటిని తక్కువగా తినాలని తెలుసుకోండి.





# నోరు ఆరోగ్యంగా ఉండాలంటే.. ఇలా చేయండి

**నోరు ఆరోగ్యంగా ఉటే మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సుకు కృషి చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పొద్దున్నే లేచి బ్రష్ చేసుకున్న అనంతరం మౌత్‌వాష్‌తో నోరు పుక్కిలిస్తుంటారు. దంతాలు-చిగుళ్ల ఆరోగ్యానికి, నోటి దుర్వాసనను దూరం చేయడానికి ఈ ప్రక్రియ బాగా తోడ్పడుతుందంటున్నారు. నిపుణులు. సాధారణంగా మార్కెట్లో దొరికే మౌత్‌వాష్‌లలో ఉండే రసాయనాల గాఢత నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. అందుకే మన వంటింట్లోనే దొరికే కొన్ని రకాల నూనెలతో నోటిని పుక్కిలించడం వల్ల నోరు శుభ్రపడడమే కాకుండా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి.**



**ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియతో ప్రయోజనాలు :** మన నోటిలో వందల కొద్ది సూక్ష్మక్రిములు ఉంటాయి. అందులో కొన్ని హానికరమైనవి ఉంటాయి. ఆ సూక్ష్మక్రిములు పంటి నొప్పి, చిగుళ్లకు సంబంధించిన వ్యాధులతో పాటుగా నోటి దుర్వాసనకు కారణమవుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ ఇలాంటి బ్యాక్టీరియాను తొలగించగలదని తాజాగా నిర్వహించిన కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. నోటిని మంచిగా శుభ్రపరచుకోకపోవడంతో నోటి ఇన్ఫెక్షన్లు, చిగుళ్లలో సమస్యల వల్ల నోటి దుర్వాసన రావడం కామన్ అని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ సమస్య నుంచి బయటపడటానికి మార్కెట్‌లో దొరికే మౌత్‌వాష్‌ల కంటే మన వంటింట్లో లభించే నూనెలే సమర్థంగా పనిచేస్తున్నట్లు మరో పరిశోధనలో వెల్లడైంది.

**ప్రతిరోజు ఆయిల్ పుల్లింగ్ :** చక్కెరకు సంబంధించిన ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవడం, దంతాల మధ్య చిక్కుకున్న పదార్థాల అవశేషాలను తొలగించుకోకపోవడం వల్ల పళ్లు పుచ్చిపోవడం మనం గమనిస్తూనే ఉంటాం. ఇలాంటి సమస్య నుంచి విముక్తి లభించడానికి నిపుణులు సూచించే అద్భుతమైన చిట్కా ఆయిల్ పుల్లింగ్. ప్రతి రోజూ ఉదయాన్నే బ్రష్ చేసుకున్న తర్వాత ఆయిల్ పుల్లింగ్ చేయడం ద్వారా రంధ్రాలకు కారణమయ్యే బ్యాక్టీరియా నశిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో చిగుళ్లలో వాపు, రక్తస్రావం లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి వారు ఆయిల్ పుల్లింగ్‌తో ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. దంతాల మీద పేరుకున్న పాచి, పసుపుదనాన్ని తొలగించడంతో పాటుగా పళ్లను మెరిపించడానికి ఈ పద్ధతి చక్కగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఆయిల్ పుల్లింగ్ ప్రక్రియ వల్ల దవడ, మెడ కండరాలకు చక్కటి వ్యాయామం అందుతుందంటున్నారు. తద్వారా ఆయా భాగాల్లో ఏదైనా నొప్పి ఉంటే తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆయిల్ పుల్లింగ్‌కు ఆలివ్, కొబ్బరి, నువ్వుల నూనెలు ఉత్తమ ఎంపిక. వీటిలో ఏదో ఒక దాన్ని ఎంచుకొని టేబుల్‌స్పూన్ నూనెను నోట్లోకి తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.ఆపై ఇరవై నిమిషాల పాటుగా మీరు తీసుకున్న నూనె నోట్లోని అన్ని మూలకు వెళ్లేలా పుక్కిలిస్తూ ఉండాలి. ఈ క్రమంలో దీన్ని మింగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి. పని పూర్తయ్యాక ఆ నూనెను ఉమ్మివేయాలి.
ఇక ఈ ప్రక్రియ ముగిసిన తరువాత ఏదైనా తినేముందు లేదా తాగే ముందు నోటిని శుభ్రపరచుకోవాలని, ఆ తర్వాతే ఆహారం తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆహారం తీసుకున్న తర్వాత సైతం నోటిని శుభ్రపరచుకోవాలని సూచిస్తున్నారు.



# ఒత్తిడిని తగ్గించుకోవచ్చా..

మనస్సు ప్రశాంతంగా ఉండాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నల గురించి అందరూ ఏదో ఒక సమయంలో ఆలోచిస్తారు. ఆరోగ్యకరమైన ఆహారమే వీటన్నింటికీ సరైన సమాధానమని తాజా సర్వేలో తేలింది.మానసిక ఆరోగ్యం కోసం క్లినికల్ ట్రైల్స్‌కి వచ్చిన డేటా ఆధారంగా కొంత మంది ఈ విషయంపై పరిశోధనలు చేశారు. సంతులిత ఆహారం తీసుకుంటే మానసిక ఆరోగ్యంతో పాటు ఒత్తిడి కూడా నియంత్రించుకోవచ్చని తేలింది. ఈ నివేదిక సైకోమెడిక్ మెడిసిన్‌లో ప్రచురితమైంది.
ఆరోగ్యకర డైట్ మనుషుల మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఉత్సుకతపై ఎలాంటి ప్రభావం చూపించదు. నిర్దిష్టమైన డైట్ తీసుకునే వాళ్లకి ఉపయోగపడుతుంది. అనవసరమైన ఆహారం తీసుకోవాల్సిన పనిలేదు. బరువు తగ్గడం, కొవ్వు నియంత్రణ, పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం లాంటి చర్యలతోనూ మానసిక ఆరోగ్యం కుదుటపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్ ఫుడ్స్‌కి బదులు పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలు తీసుకుంటే ఫలితం త్వరగా వస్తుందని ఫిర్త వెల్లడించారు





The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

ఆదివారం
సెప్టెంబర్-6-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 239

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 6

## మెదక్ పార్లమెంట్ స్థానంలో పొలిటికల్ హీట్!

### తీవ్ర చర్చనీయాంశమైన శశిధర్‌రెడ్డిపై 'సిరి' కథనం

- గులాబీ అధిష్ఠానం దృష్టికి చేరిన 'పట్లోళ్ల @ క్లీన్ ఇమేజ్!'
- గజ్వేల్, సిద్దిపేటలలో బలమైన నెట్‌వర్క్
- సదాశివపేట నుంచి సిద్దిపేట దాకా.. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్ష సంబంధాలు
- సంగారెడ్డిలో వాణిజ్య, వర్తక వర్గాలలో బలమైన పట్టు
- కేసీఆర్ కుటుంబానికి, గులాబీ జెండాకు నిబద్ధతతో ఉంటాను
- అధిష్ఠానం ఏ బాధ్యత ఇచ్చినా సిద్ధమన్న శశిధర్‌రెడ్డి

3






## విద్యుత్‌నగర్‌కు వాటర్ కట్!

### రూ. 1.20కోట్ల బకాయిలతో నీటి కనెక్షన్ తొలగింపు

7

మూడున్నరేళ్లుగా బిల్లులు చెల్లించలేదా!

- నీటి కోసం 2 వేల కుటుంబాల అవస్థలు
- సొసైటీ నిర్వహణ తీరుపై స్థానికుల ఆగ్రహం

రామచంద్రాపురం, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్): అమీన్‌పూర్ సర్కిల్, భారతీనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ (ఎంఐజీ ఫేస్-||) హౌసింగ్ సొసైటీలో తీవ్ర నీటి సంక్షోభం నెలకొంది. కాలనీకి సరఫరా అవుతున్న తాగునీటి కనెక్షన్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు తొలగించారు. సొసైటీ గత మూడున్నరేళ్లుగా నీటి బిల్లులు చెల్లించకపోవడంతో బకాయిలు సుమారు రూ. 1.20 కోట్లకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు.

బకాయిల చెల్లింపుపై గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సొసైటీ నిర్వాహకుల నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి కనెక్షన్‌ను తొలగించినట్లు సమాచారం. అయితే బకాయిలు ఇంత భారీగా పేరుకుపోయే వరకు పరిస్థితి ఎందుకు కొనసాగిందన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.



## లెక్కల టీచరమ్మకు 'కీర్తి' కిరీటం!



- వినూత్న గణిత బోధకురాలికి సముచిత గౌరవం
- మరం కీర్తి చంద్రికకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 52 మంది ఉపాధ్యాయులు
- తుది జాబితాలో నిలిచిన చంద్రిక
- నిత్య విద్యార్థిగా.. 16 ఏళ్లుగా విద్యా రంగానికి విశేష సేవలు
- 'లో కాస్ట్, నో కాస్ట్' విధానంతో మ్యాథ్స్ ల్యాబ్
- గణిత భయాన్ని పోగొడుతూ ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్
- ఎల్ఐపీ ప్రత్యేక వర్క్‌షీట్లతో ప్రయోగాత్మక బోధన
- ఎస్సీఈఆర్టీ స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా 'ప్రయోగ దీపిక' రూపకల్పన
- సంగారెడ్డికి దక్కిన అరుదైన గౌరవం

6

## సేవా పథంలో అజయ్ ట్రస్ట్

### నర్సాపూర్ గడ్డపై నిరుపేదలకు కొండంత అండ



- నిరంతరాయంగా విస్తృత ప్రజాహిత సేవా కార్యక్రమాలు
- మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మురళీ యాదవ్ వారసత్వం
- 2010లోనే కేవలం రూ. 2లకే 20 లీటర్ల శుద్ధి చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- మహిళా సాధికారత లక్ష్యంగా నర్సాపూర్ నియోజకవర్గంలో 250 ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ
- రూ. 40 లక్షల భారీ వ్యయంతో నిరుద్యోగ యువతకు ఉచిత గ్రూప్-2 నిపుణుల శిక్షణ తరగతులు
- కరోనా విపత్కర కాలంలో రూ. 40 లక్షలతో నిత్యావసర సరుకులు
- నిస్వార్థ సేవా దృక్పథంతో ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అజయ్

4





# అనుమతులిచ్చింది ప్రభుత్వమే.. బాధితులెందుకు సామాన్యులు?

### 22ఏ బాధితులకు రఘునందన్‌రావు అండ..
### – ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు..
### – సోషల్ మీడియా వేదికగా ఉద్యమించాలని పిలుపు





**రామచంద్రపురం(పటాన్‌చెరు), సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):** ప్రభుత్వ శాఖలే అనుమతులు ఇచ్చాయి.. ఆ అనుమతులను నమ్ముకుని వందలాది కుటుంబాలు ఇళ్లు కొనుగోలు చేసి ఏళ్లుగా నివసిస్తున్నారు. అలాంటి ఆస్తులను ఇప్పుడు 22ఏ జాబితాలో చేర్చడమేంటని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పటాన్‌చెరు సింఫనీ పార్క్ హోమ్స్‌లో 22ఏ బాధితులను శనివారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వారికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. 55 ఎకరాల్లో 953 ఇళ్లతో నిర్మించిన సింఫనీ పార్క్ హోమ్స్‌కు ప్రభుత్వ శాఖలే అనుమతులు జారీ చేశాయని రఘునందన్‌రావు తెలిపారు. రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అనుమతుల ఆధారంగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇళ్లను కొనుగోలు చేశారని, ఇప్పుడు వారిని 22ఏ సమస్యలోకి నెట్టడం అన్యాయమని అన్నారు.

#### ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ..

22ఏ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రఘునందన్‌రావు ఆరోపించారు. పాలనలో స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని అన్నారు. సీఎం, రెవెన్యూ మంత్రి ఆస్తులను ఒక్కరోజులో 22ఏ జాబితా నుంచి తొలగించినట్లే సామాన్యుల ఆస్తులను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు.

#### అనుమతుల ప్రక్రియను వివరిస్తూ..

రైతుల నుంచి భూములు తీసుకున్న బిల్డర్ వాటిని వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు దరఖాస్తు చేయగా, రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి అనుమతులు ఇచ్చారని రఘునందన్‌రావు తెలిపారు. అనంతరం హెచ్ఎండీఏ నుంచి లేఅవుట్ అనుమతులు, జీహెచ్ఎంసీ నుంచి నిర్మాణ అనుమతులు పొందిన తర్వాతే ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. ఈ అనుమతులన్నీ 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇచ్చారని పేర్కొన్నారు.

#### రెవెన్యూ శాఖ తీరుపై ప్రశ్నిస్తూ..

తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి స్వయంగా అంగీకరించినప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనుమతులను నమ్ముకుని ఇళ్లు కొనుగోలు చేసిన బాధితుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు.

#### ఉద్యమానికి పిలుపునిస్తూ..

సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ సమస్యను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రఘునందన్‌రావు కోరారు. అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే బాధితుల తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సింఫనీ పార్క్ హోమ్స్‌కు రెవెన్యూ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఇచ్చిన అనుమతుల కాపీలను ఎంపీ ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, దిశ కమిటీ సభ్యుడు కాసాల సుధాకర్, కాలనీ అధ్యక్షుడు విజయ్‌రాజ్, ప్రధాన కార్యదర్శి సత్యారావు, పటాన్‌చెరు నియోజకవర్గ బీజేపీ నాయకులు, 22ఏ బాధితులు పాల్గొన్నారు.

---








# హామీలు అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి పోస్టు ఊడక తప్పదు

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
### జాబ్ క్యాలెండర్ ప్రకటించి యూత్ డిక్లరేషన్ అమలు చేయాలి
### సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరిక

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా నాలుగో రోజు సంగారెడ్డిలో భారీ విద్యార్థి-యువజన నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించి, అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక ఆశలు కల్పించి, అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తవుతున్నాయి. అయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కాలేదు, జాబ్ క్యాలెండర్ జాడే లేదు. యువతకు ఇచ్చిన మాట ఏమైందని నిలదీశారు. ఈ నిరసన ర్యాలీలో చంద్ర గౌడ్, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, హకీం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, మనోహర్ గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్‌తో పాటు పెద్ద ఎత్తున యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# మెదక్ పార్లమెంట్ స్థానంలో పొలిటికల్ హీట్!

## తీవ్ర చర్చనీయాంశమైన శశిధర్‌రెడ్డిపై 'సిరి' కథనం

- గులాబీ అధిష్టానం దృష్టికి చేరిన 'పట్లోళ్ల @ క్లీన్ ఇమేజ్!'
- రైతుబాంధవుడు దివంగత పట్లోళ్ల నారాయణరెడ్డి వారసత్వం కొనసాగింపు
- ఓయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా, ఉద్యమాల్లో క్రియాశీలక నాయకుడిగా..
- ఏపీ యువ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా..
- గజ్వేల్, సిద్దిపేటలలో బలమైన నెట్‌వర్క్
- సదాశివపేట నుంచి సిద్దిపేట దాకా.. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్ష సంబంధాలు
- సంగారెడ్డిలో వాణిజ్య, వర్తక వర్గాలలో బలమైన పట్టు
- కేసీఆర్ కుటుంబానికి, గులాబీ జెండాకు నిబద్ధతతో ఉంటాను
- అధిష్టానం ఏ బాధ్యత ఇచ్చినా సిద్ధమన్న శశిధర్‌రెడ్డి

మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పోటీకి సిద్ధమవుతున్నారంటూ 'సిరి న్యూస్' ప్రచురించిన ప్రత్యేక కథనం ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో పెను తుఫాను సృష్టించింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని రాజకీయ వర్గాలు, ముఖ్య నేతలు, మేధావుల్లో 'సిరి' కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శశిధర్‌రెడ్డికి ఉన్న క్లీన్ ఇమేజ్, ప్రజాబలం, విస్తృత పరిచయాలను కళ్లకు కట్టినట్లు విశ్లేషించిన ఈ కథనం నేరుగా బీఆర్ఎస్ అధిష్టానం దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. మెదక్ ఎంపీ స్థానంలో పార్టీకి పూర్వవైభవం రావాలంటే ఆయన అభ్యర్థిత్వమే అత్యంత సమర్థవంతమైన ఎంపిక అని కార్యకర్తలు, అభిమానులు ముక్తకంఠంతో స్పష్టం చేస్తున్నారు.

-ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్

### రైతు బాంధవుడు నారాయణరెడ్డి వారసత్వం..

మెదక్ మాజీ ఎమ్మెల్యే దివంగత పట్లోళ్ల నారాయణరెడ్డి కుమారుడైన శశిధర్‌రెడ్డికి ప్రజాసేవ వారసత్వంగా అబ్బింది. రైతుల పట్ల అపారమైన ప్రేమను కనబరిచిన నారాయణరెడ్డి అడుగుజాడల్లో నడిచిన ఆయన, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెదక్ జిల్లా విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా ప్రాతినిధ్యం వహించి పలు సమస్యలపై పోరాడారు. ఆంధ్రప్రదేశ్ యువ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ న్యాయవాదుల సంక్షేమానికి బాటలు వేశారు. అంతేకాకుండా ప్రముఖ బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ సమితి కో చైర్మన్‌గా పనిచేసి నిరుద్యోగుల హక్కుల సాధన కోసం విస్తృతంగా ఉద్యమించారు. వివిధ విద్యార్థి, ప్రజా ఉద్యమాలతో మమేకమై ప్రజా నాయకుడిగా ఎదిగారు.

### గజ్వేల్, సిద్దిపేటల నుంచి సదాశివపేట దాకా..

శశిధర్‌రెడ్డి విద్యాభ్యాసం ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సాగడం ఆయనకు అదనపు బలంగా మారింది. 8, 9, 10 తరగతులు గజ్వేల్‌లోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదవడంతో గజ్వేల్ నియోజకవర్గవ్యాప్తంగా ఆయనకు భారీ ఎత్తున సహచరులు, క్లాస్‌మేట్స్ నెట్‌వర్క్ ఉంది. అలాగే సిద్దిపేటలో ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేసి పరీక్షలు రాయడంతో సిద్దిపేట పరిసర ప్రాంతాల ప్రముఖులతోనూ బలమైన సాన్నిహిత్యం ఏర్పడింది. ఇక సంగారెడ్డి పట్టణంలో ప్రతిష్టాత్మకమైన దుర్గా పెట్రోల్ బంక్‌ను స్థాపించి వ్యాపార రంగానికి విస్తరించడంతో, జిల్లావ్యాప్తంగా ఉన్న వాణిజ్య, వర్తక సంఘాల వ్యాపారులతో నేటికీ ఆయనకు సత్సంబంధాలు కొనసాగుతున్నాయి. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పనిచేసిన నేపథ్యం శశిధర్‌రెడ్డికి క్షేత్రస్థాయిలో అపారమైన బలాన్ని చేకూర్చింది. సదాశివపేట నుంచి సిద్దిపేట వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని దాదాపు 47 మండలాలు, 9 మున్సిపాలిటీలలోని గ్రామ గ్రామాన ఆయనకు వ్యక్తిగతంగా కేడర్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. ప్రతి మండలంలోనూ ఆయనకు ఆప్తులు, అభిమానులు విస్తరించి ఉన్నారు.

### కేటీఆర్, హరీశ్ రావు నాయకత్వంలో..

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్న పట్లోళ్ల శశిధర్‌రెడ్డి.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను పర్యవేక్షించడంతో పాటు, పార్టీ ఆధ్వర్యంలోని ఎస్ఐఆర్ కో చైర్మన్‌గా కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పార్టీ సంస్థాగత పటిష్టతకు నిరంతరం శ్రమిస్తూ, నాయకులను సమన్వయం చేస్తూ క్షేత్రస్థాయిలో గులాబీ జెండా బలోపేతానికి తన అనుభవాన్నంతా ధారపోస్తున్నారు.


4 | సిరి | www.siridaily.com

పట్లోళ్ల@క్లీన్ ఇమేజ్!

### అధిష్టానం ఏ బాధ్యత అప్పగించినా సిద్ధం: 'సిరి'తో శశిధర్‌రెడ్డి

'సిరి న్యూస్' ప్రచురించిన కథనంపై వస్తున్న స్పందనల నేపథ్యంలో 'సిరి' ప్రత్యేక ప్రతినిధి పట్లోళ్ల శశిధర్‌రెడ్డిని ప్రత్యేకంగా సంప్రదించగా ఆయన అత్యంత హుందాగా స్పందించారు. 'కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి జీవితాంతం అత్యంత నిబద్ధతతో, విధేయుడిగా ఉంటాను. పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు నాపై నమ్మకం ఉంచి ఏ బాధ్యతలు అప్పగించినా నిస్వార్థంగా నిర్వర్తించడానికి సిద్ధంగా ఉన్నాను' అని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధిష్టానం గనుక ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే, తన సర్వశక్తులూ ఒడ్డి మెదక్ లోక్‌సభ స్థానంలో గులాబీ జెండాను రెపరెపలాడించి తీరుతానన్న సంకేతాలను ఆయన ఇచ్చారు.





# సేవా పథంలో అజయ్ ట్రస్ట్



## నర్సాపూర్ గడ్డపై నిరుపేదలకు కొండంత అండ

- నిరంతరాయంగా విస్తృత ప్రజాహిత సేవా కార్యక్రమాలు
- మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మురళీ యాదవ్ వారసత్వం
- 2010లోనే కేవలం రూ. 2లకే 20 లీటర్ల శుద్ధి చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- మహిళా సాధికారత లక్ష్యంగా నర్సాపూర్ నియోజకవర్గంలో 250 ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ
- రూ. 40 లక్షల భారీ వ్యయంతో నిరుద్యోగ యువతకు ఉచిత గ్రూప్-2 నిపుణుల శిక్షణ తరగతులు
- కరోనా విపత్కర కాలంలో రూ. 40 లక్షలతో నిత్యావసర సరుకులు
- నిస్వార్థ సేవా దృక్పథంతో ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అజయ్

**నర్సాపూర్ , సిరి న్యూస్: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో అజయ్ ట్రస్ట్ ద్వారా సాగుతున్న సేవా ప్రస్థానం నేడు వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో ఆశాజ్యోతులను వెలిగిస్తోంది. నర్సాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్ నేత మురళీ యాదవ్, అలాగే ఉమ్మడి మెదక్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా సేవలందించిన రాజమణి మురళీ యాదవ్ దంపతుల వారసుడిగా అజయ్ యాదవ్ ప్రజాసేవను తన శ్వాసగా మార్చుకున్నారు. తల్లిదండ్రుల స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే పరమావధిగా అజయ్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు, యువతకు, మహిళలకు అండగా నిలుస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు.**




### రెండు రూపాయలకే శుద్ధజలం

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, ఫ్లోరైడ్ బారిన పడుతున్న ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అజయ్ ట్రస్ట్ 2010లోనే ఒక విప్లవాత్మక అడుగు వేసింది. నర్సాపూర్ పట్టణంలో అత్యాధునిక ఆర్వో వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పి, కేవలం రూ. 2 నామమాత్రపు రుసుముతోనే 20 లీటర్ల శుద్ధి చేసిన మినరల్ వాటర్‌ను పేద ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఇంతటితో ఆగకుండా, నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యాత్మక గ్రామాలకు సైతం సొంత ఖర్చులతో పూర్తిస్థాయి తాగునీటి ప్లాంట్లను ఉచితంగా విరాళంగా అందించి లక్షలాది మంది ప్రజల దాహార్తిని, ఆరోగ్య సమస్యలను శాశ్వతంగా తీర్చారు.

### యువతకు కొండంత ప్రోత్సాహం

నిరుద్యోగ యువతకు, పేద విద్యార్థులకు అజయ్ ట్రస్ట్ మార్గదర్శిగా నిలుస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే గ్రామీణ యువత కోసం నర్సాపూర్‌లో ఏకంగా రూ. 40 లక్షల నిధులను వెచ్చించి ప్రముఖ



అధ్యాపకులతో నాణ్యమైన ఉచిత గ్రూప్-2 కోచింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విలువైన స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడంతో పాటు, ఆన్‌లైన్ విద్య అనివార్యమైన తరుణంలో నిరుపేద ప్రతిభావంతులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ మొబైల్స్ అందించారు. అత్యున్నత ఆశయంతో సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవుతున్న ఇద్దరు నిరుపేద విద్యార్థులకు దేశ రాజధాని ఢిల్లీలో ఐఏఎస్, ఐపీఎస్ ఉచిత విద్య, శిక్షణ పూర్తయ్యే వరకు మొత్తం ఖర్చులను ట్రస్ట్ భరించి ఆదర్శంగా నిలిచింది.




### క్రీడలు, సంస్కృతికి పెద్దపీట

గ్రామీణ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వావలంబన సాధించాలనే సంకల్పంతో నర్సాపూర్ పట్టణ, పరిసర ప్రాంతాల మహిళలకు సుమారు 250 అత్యాధునిక కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ యువతలో క్రీడా స్ఫూర్తిని రగిలించేందుకు క్రికెట్, వాలీబాల్ కిట్లను భారీగా విరాళమిచ్చారు. అంతేకాకుండా, నర్సాపూర్‌లోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల బీవీఆర్ఐటీ వేదికగా జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి క్రీడాకారులకు జాతీయ గుర్తింపు లభించేలా తోడ్పడ్డారు. గ్రామీణ ఆధ్యాత్మికతను గౌరవిస్తూ నూతనంగా నిర్మించే పలు ఆలయాలకు గ్రానైట్ రాళ్లు, సిమెంట్, ఇసుక, ఇటుకల నిర్మాణ సామగ్రిని స్వయంగా విరాళంగా సమకూర్చారు.

### కరోనా కాలంలో రూ. 40 లక్షల సేవా యజ్ఞం..

కోవిడ్ మహమ్మారి యావత్ ప్రపంచాన్ని వణికించిన సంక్షోభ సమయంలో అజయ్ ట్రస్ట్ ప్రజలకు ప్రాణ రక్షణ కవచంగా నిలిచింది. లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయిన పేదలకు, కార్మికులకు దాదాపు రూ. 40 లక్షల వ్యయంతో ఉచితంగా నిత్యావసర సరుకులు, పౌష్టికాహార కిట్లు, ప్రాణరక్షక మందులను ఇంటింటికీ చేరవేశారు. అలాగే, చనిపోయిన నిరుపేదల అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించేందుకు నర్సాపూర్ మున్సిపాలిటీకి అజయ్ ట్రస్ట్ తరపున ఒక ప్రత్యేక 'వైకుంఠ రథం' వాహనాన్ని విరాళంగా అందించారు. చీకట్లో మగ్గుతున్న పల్లెలకు కొత్త వెలుగులు నింపేందుకు గ్రామాల్లో ప్రధాన




కూడళ్ల వద్ద ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేయించారు.

### రాయారావు చెరువు సుందరీకరణ..

నర్సాపూర్ పట్టణ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, పచ్చదనం అందించే దిశగా రాయారావు చెరువును అజయ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృతంగా అభివృద్ధి చేశారు. ప్రజల శారీరక దృఢత్వం కోసం ఆధునిక ఓపెన్ జిమ్ పరికరాలు, చిన్నారుల మానసిక ఉల్లాసం కోసం ప్రత్యేక ప్లే ఏరియా ఆట సామగ్రి, ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు అనువుగా నాణ్యమైన వాకింగ్ ట్రాక్‌ను తీర్చిదిద్ది పట్టణ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కానుకగా అందించారు. పుట్టిన గడ్డకు, సమాజానికి ఏదో ఒకటి తిరిగి ఇవ్వాలన్న తపనతో అజయ్





# మహిళలకు ఇచ్చిన హామీలు గాలికి

- వెయ్యి రోజుల పాలన...హామీలు ఎక్కడ?
- కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. మోసపూరిత పాలన
- పింఛన్ల పెంపు ఏమైంది?
- అభివృద్ధి శూన్యం.. ప్రకటనలే ఎక్కువ
- మహిళా సదస్సులో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజం

**మహిళలకు రూ.2,500 భృతి.. తులం బంగారం.. ఉచిత స్కూటీలు ఏమయ్యాయి?**

మెదక్ , సెప్టెంబర్,05(సిరి న్యూస్) :రాష్ట్రంలోసీఎం రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన పూర్తిగా మోసపూరితంగా సాగుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమ యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా..ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మ దేవేందర్‌రెడ్డి మహిళలతో కలిసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, బంజారా మహిళలతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ,కోలాటం ఆడుతూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన తులం బంగారం, ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం,విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రతి నెలా మహిళలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. 33 నెలల కాలానికి ఒక్కో మహిళకు సుమారు రూ.82,500 బకాయి పడినట్లేనని పేర్కొన్నారు.వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. 33నెలల కాలానికి వృద్ధులు, బీడీ కార్మికులకు ఒక్కొక్కరికి సుమారు రూ.66 వేల చొప్పున, దివ్యాంగులకు కూడా రూ.66 వేల చొప్పున బకాయి ఉందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందించిన రైతుబంధు కంటే ఎక్కువగా రైతులకు ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో పాఠశాలల్లో మౌలిక వసతులు క్షీణించాయని, విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోయి వేలాది పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, చౌదరి సుప్రభాత్ రావు లు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1003 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని విమర్శించారు.ఎన్నికల సమయంలో మహిళల కోసం ప్రకటించిన మహిళా డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా విస్మరించారని విమర్శించారు.అలాగే పింఛన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను మరిచిపోయారని అన్నారు. రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి ప్రజలను మభ్య పెట్టారని, ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను ఆగం చేశారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును విస్మరించిందని తిరుపతిరెడ్డి విమర్శించారు.మహిళలు,రైతులు,వృద్ధులు,దివ్యాంగులు,నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు.మహిళలు, రైతులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని వారు అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజల పక్షాన నిలబడి హామీల అమలు కోసం ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు అరేళ్ళ.మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టి.జగపతి,ఆకిరెడ్డి.కృష్ణరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ ఆంజనేయులు,మున్సిపల్ కౌన్సిలర్ లు అనీస్ ఫాతిమా,జుబెర్ అహ్మద్,దీపక్ కుమార్,ఉదయ్ కుమార్,సోహెల్,మాజీ కౌన్సిలర్ లు అంకం.చంద్రకళ,మాయమల్లేశం,ఆర్కే శ్రీనివాస్,శంకరంపేట్ మాజీ జడ్పీటీసీ మాధవి రాజు,రామాయంపేట మాజీ ఎంపీపీ పుట్టి.విజయలక్ష్మి, కౌన్సిలర్ చౌదరి చరిత,మెదక్, హవెలిఘనపూర్, శంకరంపేట్ , పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కిష్టయ్య, మహిళా నాయకురాలు ప్రభావతి,సుజాత, రాధా, లత, ,సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు,ఎంపీటీసీ లు,నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# లెక్కల టీచరమ్మకు ‘కీర్తి’ కిరీటం!






- వినూత్న గణిత బోధకురాలికి సముచిత గౌరవం
- మఠం కీర్తి చంద్రికకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 52 మంది ఉపాధ్యాయులు
- తుది జాబితాలో నిలిచిన చంద్రిక
- నిత్య విద్యార్థిగా.. 16 ఏళ్లుగా విద్యా రంగానికి విశేష సేవలు
- ‘లో కాస్ట్, నో కాస్ట్’ విధానంతో మ్యాథ్స్ ల్యాబ్
- గణిత భయాన్ని పోగొడుతూ ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్
- ఎల్ఐపీ ప్రత్యేక వర్క్‌షీట్లతో ప్రయోగాత్మక బోధన
- ఎస్సీఈఆర్టీ స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా ‘ప్రయోగ దీపిక’ రూపకల్పన
- సంగారెడ్డికి దక్కిన అరుదైన గౌరవం

**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:** సంగారెడ్డి జిల్లా విద్యా రంగానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. హత్నూర మండలం, దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత స్కూల్ అసిస్టెంట్ మరియు ఎస్సీఈఆర్టీ స్టేట్ రిసోర్స్ పర్సన్ మఠం కీర్తి చంద్రికను తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2026కు ఎంపిక చేసింది. పాఠశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 52 మంది ప్రతిభావంతులైన ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో ఆమె సముచిత స్థానం దక్కించుకున్నారు. సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే అధికారిక వేడుకల్లో ఆమెకు ఈ అవార్డును కీర్తి చంద్రిక అందుకున్నారు.

### అంకితభావంతో 16 ఏళ్ల ప్రస్థానం

విద్యా విలువలు కలిగిన కుటుంబంలో జన్మించిన కీర్తి చంద్రిక చిన్ననాటి నుంచే చదువులో విశేష ప్రతిభను కనబరిచారు. ఆమె తండ్రి బసవేశ్వర్ పాఠశాల విద్యాశాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి పదవీ విరమణ పొందగా, తల్లి నాగేంద్రమ్మ గృహిణిగా ఇంట్లోనే ఉత్తమ క్రమశిక్షణ, విద్యా వాతావరణాన్ని అందించారు. పాఠశాల, కళాశాల విద్యను సంగారెడ్డిలోనే పూర్తి చేసి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఆమె.. ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఎస్సీ సైకాలజీ మరియు బీఈడీ పూర్తి చేసి నిత్య విద్యార్థిగా నిలిచారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం జీవనోపాధిగా కాకుండా సమాజ సేవగా భావించి గత 16 సంవత్సరాలుగా అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఆమె భర్త రాజేష్ సైతం సంగారెడ్డి జిల్లాలోనే ఉపాధ్యాయుడిగా సేవలందిస్తుండటంతో, వారి కుటుంబం యావత్తూ విద్యారంగానికే అంకితమై ఆదర్శంగా నిలిచింది.

### భయాన్ని పోగొట్టే ప్రయోగాత్మక బోధన

గణితం అంటే గ్రామీణ విద్యార్థుల్లో ఉండే సహజమైన భయాన్ని పారద్రోలి, ఆ సబ్జెక్టును అత్యంత సులభంగా, ఆనందదాయకంగా మార్చేందుకు కీర్తి చంద్రిక అనేక వినూత్న ప్రయోగాలు చేశారు. దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలలో అతి తక్కువ ఖర్చు మరియు ఖర్చు లేని వ్యర్థ వస్తువులతో ఆకర్షణీయమైన గణిత ప్రయోగశాలను స్వయంగా తీర్చిదిద్దారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులు క్లిష్టమైన సిద్ధాంతాలు, లెక్కల భావనలను బట్టీ పట్టకుండా, స్వయంగా పరిశీలిస్తూ ప్రాజెక్ట్ ఆధారిత పద్ధతిలో నేర్చుకునేలా తీర్చిదిద్దారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ప్రత్యేక వర్క్‌షీట్లు రూపొందించి క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధించారు.

### ఎస్సెస్సీలో 100శాతం ఉత్తీర్ణత

పాఠశాలలో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా సామగ్రి కల్పనకు దాతల సహకారాన్ని సమన్వయం చేయడంలో ఆమె ముందున్నారు. డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారాన్ని సమకూర్చుకుని 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ‘బీఎంఏఏపీ’ కింద ప్రాథమిక గణిత సామర్థ్యాల వర్క్‌బుక్‌లను పూర్తి ఉచితంగా అందించారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల భయం పోగొట్టేలా విజయపథం ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయించారు.


### స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా

తరగతి గది నాలుగు గోడలకే తన సేవలను పరిమితం చేయకుండా, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా కీర్తి చంద్రిక రాష్ట్రస్థాయిలో గణనీయమైన సేవలందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఇచ్చే గణిత శిక్షణ మాడ్యూళ్లు, పరీక్ష మూల్యాంకన విధానాల రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. ఎస్సీఈఆర్టీ అధికారికంగా ప్రచురించిన ప్రతిష్టాత్మక ‘ప్రయోగ దీపిక - గణిత ప్రయోగశాల మాన్యువల్’తో పాటు పలు అభ్యాస దీపికల రూపకల్పన రచయితల బృందంలో ప్రధాన పాత్ర పోషించారు. దీనికితోడు 2022 నుంచి విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో జరుగుతున్న ‘విద్యార్థి విజ్ఞాన్ మంథన్’ సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంగారెడ్డి జిల్లా సమన్వయకర్తగా, రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తున్నారు.

## ఉపాధ్యాయ లోకం హర్షం

ఉపాధ్యాయురాలిగానే కాకుండా విద్యార్థుల మానసిక సమస్యలను పరిష్కరించే కౌన్సిలర్‌గా, మోటివేటర్‌గా గుర్తింపు పొందిన కీర్తి చంద్రికకు రాష్ట్ర స్థాయి పురస్కారం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు, దౌల్తాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తన ఎంపిక పట్ల కీర్తి చంద్రిక స్పందిస్తూ.. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయుల నిరంతర ప్రోత్సాహం, తన భర్త రాజేష్ మరియు కుటుంబ సభ్యుల సహకారమే ఈ విజయానికి కారణమని కృతజ్ఞతలు తెలియజేశారు.






# విద్యుత్‌నగర్‌కు వాటర్ కట్!

- మూడున్నరేళ్లుగా బిల్లులు చెల్లించలేదా..!
- నీటి కోసం 2 వేల కుటుంబాల అవస్థలు
- సొసైటీ నిర్వహణ తీరుపై స్థానికుల ఆగ్రహం

**రూ.1.20కోట్ల బకాయిలతో నీటి కనెక్షన్ తొలగింపు**

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 5 (సిరి న్యూస్): అమీన్‌పూర్ సర్కిల్, భారతీనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్ (ఎంఐజీ ఫేస్-||) హౌసింగ్ సొసైటీలో తీవ్ర నీటి సంక్షోభం నెలకొంది. కాలనీకి సరఫరా అవుతున్న తాగునీటి కనెక్షన్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు తొలగించారు. సొసైటీ గత మూడున్నరేళ్లుగా నీటి బిల్లులు చెల్లించకపోవడంతో బకాయిలు సుమారు రూ.1.20 కోట్లకు చేరినట్లు అధికారులు చెబుతున్నారు.**

బకాయిల చెల్లింపుపై గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ సొసైటీ నిర్వాహకుల నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి కనెక్షన్‌ను తొలగించినట్లు సమాచారం. అయితే బకాయిలు ఇంత భారీగా పేరుకుపోయే వరకు పరిస్థితి ఎందుకు కొనసాగిందన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

### నీటి కోసం 2 వేల కుటుంబాల ఇబ్బందులు

నీటి సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్‌నగ ర్‌లోని సుమారు 2 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇళ్లలో నిల్వ ఉన్న నీరు కూడా నిండుకోవడంతో తాగునీరు, ఇతర అవసరాల కోసం బయట నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద నివాస ప్రాంతంలో ఒక్కసారిగా నీటి సరఫరా నిలిచిపోవడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

### సొసైటీ నిర్వహణపై ప్రశ్నలు

కాలనీవాసుల నుంచి క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ చార్జీలు వసూలు చేస్తున్నప్పుడు వాటర్ బోర్డు బిల్లులు ఎందుకు చెల్లించలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మూడున్నరేళ్లుగా బకాయిలు పేరుకుపోతున్నప్పటికీ సమస్యను పరిష్కరించేందుకు సొసైటీ నిర్వహణ చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యానికి కాలనీలోని వేలాది మంది కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి రావడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బకాయిల సమస్యను సొసైటీ ప్రతినిధులతో చర్చించి పరిష్కరించడంతో పాటు, తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా, ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు మానవీయ కోణంలో స్పందించి తాత్కాలికంగా నీటి సరఫరా అందించాలని, సొసైటీ బకాయిల అంశాన్ని పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బకాయిలు ఎలా పేరుకుపోయాయన్న అంశంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



## శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించిన అకిరా నందన్ రెడ్డి



హత్నూర, సెప్టెంబర్ 05,(సిరి న్యూస్) శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని హత్నూర మండలం చందాపూర్ గ్రామానికి చెందిన చిన్నారి అకిరా నందన్ రెడ్డి ని శ్రీకృష్ణుడి వేషధారణలో ప్రత్యేకంగా అలరించాడు. శ్రీకృష్ణుడి వేషంలో అందంగా ముస్తాబై, నెమలి పింఛం, కిరీటం, పీతాంబరం ధరించి చిన్నారి చూపరులను ఆకట్టుకున్నాడు. జన్మాష్టమి సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలంకరించడం ద్వారా పండుగ వాతావరణం నెలకొంది. అకిరా నందన్ రెడ్డి శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న దృశ్యాలను చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.